## హస్నాబాద్ విద్యార్థినికి ప్రథమ స్థానం



రితీషాను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**దుద్యాల, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** మండలంలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన రితీషా జిల్లా స్థాయి గణిత ప్రతిభ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచింది. రితీషా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హస్నాబాద్ యందు 10వ తరగతి చదువుతుంది. తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి, మండల స్థాయి నుండి జిల్లా స్థాయికి ప్రతిభ పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన రితీషాకు తెలంగాణ గణిత ఫోరం సభ్యులు జ్ఞాపికను అందించారు. గురువారం పాఠశాల ఉపాధ్యాయులు రితీషాను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు నర్సింలు, ఉపాధ్యాయులు శ్రీశైలం, అనిల్, ముస్తాక్ పటేల్, అనితా బాయి పాల్గొన్నారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## దరఖాస్తుల స్వీకరణ..ఇంటర్వ్యూలు

### మేడ్చల్ జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రఘునాధస్వామి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 12, ప్రభాతవార్త**

మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో కాంట్రాక్టు పద్ధతిలో నియామకాలు ఉంటాయని, ఖాళీలుగ ఉన్న వివిధ పోస్టులకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ధరఖాస్తులు చేసుకుని శుక్రవారం ఉదయం 11గంటలకు జరిగే వాకిన్ ఇంటర్వ్యూలకు హాజరు కావాలని మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రఘునాధస్వామి కోరారు. మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని డిఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11గంటలకు ధరఖాస్తుల స్వీకరణ వాకిన్ ఇంటర్వ్యూలు జరుగనున్నట్లు తెలిపారు. ఖాళీలుగ ఉన్న 3ప్రొఫెసర్ల పోస్టులకు, 18అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులకు, 4ట్యూటర్ పోస్టులకు, 14సీనియర్ రెసిడెంట్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని, సంబంధిత సర్టిఫికెట్లతో హాజరు కావాలని, మెరిట్ ఆధారంగ నియామకాలు ఎంపిక జరుగనున్నట్లు, రెండు సెట్ల జిరాక్స్ సర్టిఫికెట్స్‌తో పాల్గొనాలని ఆయన వివరించారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

## క్రీడలు భవిష్యత్తుకు పునాది

### లావణ్య, సుదర్శన్‌గౌడ్

**కొత్తూర్, డిసెంబరు 12, ప్రభాతవార్త :** క్రీడలు విద్యార్థుల భవిష్యత్తుకు పునాది అని మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్య, కొత్తూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జండగూడం సుదర్శన్‌గౌడ్ అన్నారు. కొత్తూర్ మున్సిపాలిటీలోని మున్సిపల్ కార్యాలయ మైదానంలో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల సందర్భంగా వారు మాట్లాడుతూ....గత రెండు రోజులుగా కొత్తూర్ మండల కేంద్రంలో సీఎం కప్ క్రీడలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైన ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. క్రీడలు నరపోత్సహించడంలో భాగంగా క్రీడలు మాత్రమే కాదు జీవితంలో విజయం సాధించడానికి అవసరమైన నైపుణ్యాలను కూడా పెంపొందిస్తాయన్నారు. విద్యా అభ్యాసంతో పాటు క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి, శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు.

**విద్యార్థులకు భోజన వసతులు ఏర్పాటు చేసిన సుదర్శన్‌గౌడ్**

కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జండగూడెం సుదర్శన్‌గౌడ్ క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థుల కోసం తన స్వంత ఖర్చులతో రెండు రోజుల పాటు భోజన వసతులు కల్పించారు. విద్యార్థుల సాధనకు అన్ని విధాల సహాయం అందిస్తామన్నారు. అలాగే క్రీడలల్లో పాల్గొనడం ద్వారా విజయం సాధించేందుకు కావాల్సిన ధైర్యం, పట్టుదల, ఆరోగ్యాన్ని అందిపుచ్చుకోవచ్చన్నారు. క్రీడల వల్ల విద్యార్థుల్లో కొత్త ఉత్సహాన్ని నింపడమే కాకుండా, వారి ప్రతిభను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించింది. సీఎం కప్ క్రీడాపోటీలు విజయవంతంగా సాగడంలలో స్థానిక నాయకుల సహకారంతో పాటు మున్సిపల్ అధికారుల కృషి ప్రశంసానీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, ఎంపీడివో అరుంధతి, ఎంఈవో అంగూర్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వీరమోని దేవేందర్‌ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు శివశంకర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చింత సాయి తేజేశ్వర్, పీఈటీ శ్రీలత, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడికి రిమాండ్

**కడ్తాల్, డిసెంబర్ 12, ప్రభాత వార్త :** రాత్రివేళ ఇంట్లోకి ప్రవేశించి మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడిని గురువారం అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు కడ్తల్ సీఐ శివప్రసాద్ తెలిపారు. 5/12/204, రాత్రి కడ్తాల్ మండల పరిధిలోని పల్లె చెల్క తండా గ్రామంలో ఇస్లామత్ మత్రు, అదే గ్రామంలో రాత్రి ఓ ఇంట్లోకి చొరబడి మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎవరైనా మహిళలపై అసభ్యంగా ప్రవర్తించిన, దూషించిన ఫోను ద్వారా వేదించిన చట్టపరమైన చర్యలు తప్పవని సిఐ శివప్రసాద్ హెచ్చరించారు.

## కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

### జిల్లా అధ్యక్షులు ఎండి అబ్దుల్ అజీజ్



కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, డిసెంబర్ 12 ప్రభాతవార్త :** కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని జిల్లా అధ్యక్షులు ఎండి అబ్దుల్ అజీజ్ డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షాలో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలంటూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట చేస్తున్న నిరసన కార్యక్రమం గురువారంతో 6వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు ఉద్యోగులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఉద్యోగులను రెగ్యులర్ చేసేంత వరకు మినిమమ్ టైమ్ స్కేల్ ఇవ్వాలన్నారు. ఎంతో అంకితభావంతో తాము పనిచేస్తున్నామని, కనీస ఉద్యోగ భద్రత లేకపోవడంతో జీవితంలో అనేక ఒడిదుడుకులు ఎదురుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు శ్రీలత, సంపత్, సాయి, లక్ష్మి, పద్మ, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల్లో ఉన్నత పాఠశాల

**ఉన్న గదులు కూల్చివేశారు..కొత్తవి నిర్మించడం మరిచారు**

**గదులులేక చెట్ల కిందనే పాఠాలు**

**జానంపేట పాఠశాల దుస్థితి**

**షాద్‌నగర్, డిసెంబరు 12 ప్రభాతవార్త :** నియోజకవర్గంలోనే ఇది రెండవ బడి.. ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన గుడి.. నిజాం కాలం నాటి ఈ బడిలో అప్పుడు నిర్మించిన గదులే దిక్కు.. దీంతో విద్యార్థులకు అడు గడు గునా ఎదురవుతోంది చిక్కు.. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ఫరూఖ్‌నగర్ మండల కేంద్రంగా పిలవబడే జానంపేట ఉన్నత పాఠశాల దుస్థితి ఇది. నిజాం కాలంలోనే ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద పాఠశాల తర్వాత నిర్మాణమైన ఈ పాఠశాల ప్రస్తుతం దుస్థితిలో అల్లాడుతోంది. తనను కాపాడే పాలకుల కోసం దీనంగా ఎదురుచూస్తోంది. ఈ పాఠశాల గత వైభవాన్ని, ప్రస్తుత పరిస్థితిని ఒక్కసారి నెమరు వేసుకుంటే..

**ఇది చరిత్ర..**

1935లో నిజాం కాలంలో ఆజం అలీఖాన్ వద్ద మంత్రిగా పనిచేసిన కిషన్ ప్రసాద్ బహదూర్ ఆధ్వర్యంలో ఈ పాఠశాల నిర్మాణం జరిగింది. 1954లో అప్పటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు ఈ పాఠశాల ఉన్నత పాఠశాలగా మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు. 90వ దశకం వరకు బాలుర పాఠశాలగా ఉన్న ఈ పాఠశాల తర్వాత కో ఎడ్యుకేషన్‌గా మార్చారు. ఈ పాఠశాలలో చదివిన ఎంతో మంది వివిధ ఉన్నత స్థాయి ఉద్యోగాలలో కొలువుదీరారు. రాజకీయంగా కూడా ఎదిగిన నాయకులు ఎందరో ఈ పాఠవాల చిట్టు నీడనే చదివారు. గతంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అనుబంధంగా ఉన్న ఈ పాఠశాల తర్వాత కాలంలో జిల్లా పరిషత్ ఆధీనంలోకి వెళ్లింది. ఇక ఈ పాఠశాల వర్తమాన పరిస్థితిని ఒక్కసారి



పురాతనమైన తరగతి గదిని చూపిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు



శిథిలమైన పాఠశాలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పరిశీలించినట్లయితే..

**శిథిలావస్థకు చేరిన గదులు.. శిథిలాక్షరాలు..**

శిథిలావస్థలో ఉండి ప్రమాదకరంగా ఉన్న ఈ పాఠశాల నీడన విద్యార్థులు చదవాల్సిన పరిస్థితి ప్రస్తుతం నెలకొంది. నిజాం కాలంలో కట్టిన కట్టడాలే ఇంకా కొనసాగుతుండడంతో అవి శిథిలమైపోయి చెట్టు కింద చదవాల్సిన పరిస్థితి విద్యార్థుది. ప్రస్తుతం ఈ పాఠశాలలో కొత్తగా 6 గదులు నిర్మించాల్సిన అవసరం ఉంది. అలాగే పాఠశాల మొత్తాన్ని ఆధునీకరించి ప్రహరీగోడ ఏర్పాటు చేయాల్సిన అవసరం కూడా ఉంది. మరోవైపు 340 మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలలో మరుగుదొడ్లు సరిపోయినన్ని లేక ఇబ్బందులు తప్పడం లేదు. ఇవి కాకుండా ఒక డైనింగ్ హాల్, పిల్లలు కార్యక్రమాలు నిర్వహించేందుకు వేదిక, స్టాఫ్ రూమ్, గ్రంధాలయం, సైన్స్ ల్యాబ్, వంటగది వంటివి నిర్మించాల్సిన అవసరం ఉంది. దుర్భరమైన పరిస్థితుల్లో విద్యార్థులు చెట్లకింద చదువుకోవడం, చెట్ల కిందే తినడం వల్ల అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి ఇక్కడ నెలకొని ఉంది. ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య కూడా క్రమక్రమంగా పెరుగుతుంది. 2021-22 విద్యా సంవత్సరంలో ఇక్కడ 400 మంది విద్యార్థులు ఉండగా 2022-2023 నాటికి ఈ సంఖ్య 412కు పెరిగింది. ఇక ఈ విద్యా సంవత్సరంలో 430 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకుంటున్నారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియం కూడా ఉన్న ఈ పాఠశాలలో 13 సెక్షన్లు ఉన్నాయి. 24 మంది ఉపాధ్యాయులు, నలుగురు నాన్ టీచింగ్ స్టాఫ్ అవసరం ఉంది. ఈ అవసరాలన్నీ తీర్చాల్సిన బాధ్యత పాలకులపై ఉంది.

**కాంగ్రెస్ నేతల పరిశీలన..**

ఇదిలా ఉండగా బుధవారం పాఠశాలను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య ఆధ్వర్యంలో నేతలు చెంది తిరుపతిరెడ్డి, అగ్గనూరు బస్వం, దంగు శ్రీనివాస్ యాదవ్, ముబారక్, ఇబ్రహీం, ఖదీర్, గంగనమోని సత్తయ్య, దిలీప్ కుమార్, మల్లేష్, యాదయ్య, బాల గంగాధర్ తిలక్, శ్రీదేవి పరిశీలన నిమిత్తం వెళ్లారు. ఈ సందర్భంగా పాఠశాల సమస్యలపై విద్యార్థులు వినతిపత్రం ఇచ్చారు. విద్యార్థులతో మాట్లాడిన నాయకులు సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, తదితర సిబ్బంది కాంగ్రెస్ నాయకులకు ఒక విజ్ఞాపన పత్రం కూడా అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇక్కడి నాయకులు హడావిడి చేసి ఉన్న గదులను కూల్చివేశారని, కొత్త గదులు నిర్మించకుండా వదిలేయడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకువెళ్లి తప్పనిసరిగా పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని ఈ సందర్భంగా నేతలు హామీ ఇచ్చారు.



మేడ్చల్ పట్టణంలోని వివేకానంద విగ్రహం వద్ద ఏర్పడిన ట్రాఫిక్ జాం

## ట్రాఫిక్ ఉంటే మాకేంటి.. చలాన్‌లే మాకు ముఖ్యం

**ప్రమాదాలు జరుగుతున్నా, రద్దీ ఏర్పడిన పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు**

**ఇరుకు రోడ్డు రద్దీలో వాహనాల చెకింగ్**

**మేడ్చల్, డిసెంబర్ 12. ప్రభాతవార్త :** ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయాల్సిన ట్రాఫిక్ పోలీసులు వాహనదారుల మీద నోరు పారేసుకుంటు ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారని బాధిత ప్రజలు ఆరోపిస్తున్నారు. మేడ్చల్ పట్టణంలోని వివేకానంద విగ్రహం వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్న అక్కడ ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్ కూడా ఏర్పాటు చేయపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడి వాహనదారులు నరక యాతన పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు మేడ్చల్ పోలీస్ స్టేషన్ ముందు మాత్రం నలుగైదుగురు నిలబడి వాహనాలను చెక్ చేయడమే కాకుండా సామాన్య ప్రజలను బూతులు తిడుతు అసభ్యంగా మాట్లాడుతున్నారనె విమర్శలు వినిపిస్తున్నాయి. మేడ్చల్‌లో రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా నేషనల్ హైవే 44 లో రోడ్డు మధ్యలో వేస్తున్న పిల్లర్ల కారణంగా రోడ్డు చిన్నదిగా మారి ట్రాఫిక్ సమస్య నిత్య వ్యహరంగా మారింది. అంతే కాకుండా వాహనాల రాకపోకులకు ఇబ్బందులు ఏర్పడి తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రద్దీ నివారణకు గాని, ప్రమాదాలు జరుగకుండా ఎలాంటి చర్యలు తీసుకోని ట్రాఫిక్ పోలీసులు మాత్రం ఇరుకుగా ఉన్న రోడ్లలోనే తిష్ట వేసి వాహనాలను చెక్ చేస్తున్నారు. అక్కడ సామాన్య ప్రజలకు సంబంధించిన లైసెన్స్ చెక్ చేయడం లేదా నిబంధన విరుద్ధంగా వెళుతున్నానని చెప్పడం పలు విమర్శలకు దారితీస్తుంది. అసలే ట్రాఫిక్ సమస్యల్లో పూర్తిగా రద్దీ ఏర్పడుతుండగా పోలీసులు అక్కడ ప్రతి ఒక్కరిని ఆపి కొత్త సమస్యలు సృష్టిస్తూ తీవ్ర ట్రాఫిక్ అంతరాయం చేస్తున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ కంట్రోల్ చేయాల్సిన పోలీసులు అది పూర్తిగా మర్చిపోయి వాహనాలు వెళుతుండగా మధ్యలోకి వెళ్లి ఆపుతూ నాన్న హంగామా సృష్టిస్తూ చలాన్లు రాస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి అంతేకాకుండా మేడ్చల్ ముఖ్య కూడలిలో కానిస్టేబుళ్లను కాకుండా మహిళ హోంగార్డులను పెట్టి ట్రాఫిక్‌ను మేనేజ్ చేస్తున్నారు. కానిస్టేబుళ్లు మాత్రం ఎక్కడ సక్రమంగా పనిచేయకుండా ఫోన్లో కబుర్లు మాట్లాడుకుంటూ నిలబడతారు అనే విమర్శలు ఉన్నాయి.



పోలీస్‌స్టేషన్ ముందు ఇరుకుగా ఉన్న రోడ్డులో ట్రాఫిక్ మధ్యలోకి వెళ్లి వాహనాలను ఆపుతున్న ట్రాఫిక్ పోలీసులు

# ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై కలెక్టర్ తనిఖీ

**కొడంగల్, డిసెంబర్ 12ప్రభాతవార్త**

ఇందిరమ్మ ఇళ్ళ పథకం ద్వారా అర్హులైన వారికి లబ్ది చేకూర్చేందుకు వీలుగా నిర్వహిస్తున్న మొబైల్ యాప్ సర్వేను కలెక్టర్ ప్రతీక్ జైన్ గురువారం పరిశీలించారు. కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు ఇంద్రానగర్ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ళ కోసం ప్రజాపాలన సందర్భంగా ధరఖాస్తులు చేసుకున్న లబ్దిదారుల వివరాలను సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ మొబైల్ యాప్ ద్వారా అన్‌లైన్‌లో నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా ధరఖాస్తుదారుల ఇళ్ళను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సొంత స్థలం కలిగి ఉన్నారా, ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇంటి యజమాని ఎవరు, పాత పెకుటింట్లో ఉంటున్నారా లేక పక్కా గృహమా, నివేశన స్థలానికి సంభందించి ఏమైనా ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయా..? తదితర అంశాలను పరిశీలిస్తూ మొబైల్ యాప్‌లో వివరాలు నమోదు చేయించారు. ఒక్కో ధరఖాస్తుదారుడి వివరాలను నమోదు చేసేందుకు ఎంత సమయం పడుతోంది, రోజుకు సగటున ఎన్ని కుటుంబాల వివరాలు నమోదు చేస్తున్నారు. సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అంటూ ఇప్పటివరకు ఎంతమంది వివరాలు సేకరించారని అడిగి తెలుసుకున్నారు. అన్‌లైన్‌లో ఎన్ని వివరాలను అప్‌లోడ్ చేశారని అధికారులను కలెక్టర్ వివరాలు అడిగి వారికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలను తూచ తప్పకుండా పాటిస్తూ తప్పిదాలకు తావులేకుండా వివరాలను సేకరిస్తూ అన్‌లైన్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. పురాతన, శిధిలావస్థకు చేరిన పాతకాలం నాటి ఇళ్ళలో నివాసం



ఇళ్ల లబ్దిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

ఉంటున్న వారు ఎవరైనా వాటి స్థానంలో కొత్త ఇళ్ళను నిర్మించుకునేందుకు ముందుకు వస్తే అలాంటి వారి వివరాలను కూడా సర్వే యాప్‌లో పొందుపర్చాలని అన్నారు. అర్హత కలిగిన కుటుంబాలకు ప్రభుత్వపరంగా లబ్ది చేకూరేందుకు వీలుగా వివరాల నమోదులో అవసరమైన అన్ని జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కలెక్టర్‌తో పాటు కొడంగల్ మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## గడువులోగా వ్యవసాయ గణన పూర్తిచేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త:** ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా వ్యవసాయ గణన పూర్తిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో 11వ ప్రపంచ వ్యవసాయ గణనపై రెండవ దఫాగా క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మాట్లాడుతూ, జిల్లా పరిధిలోని రెవెన్యూ గ్రామం యూనిట్‌గా తీసుకొని సర్వే నంబర్ల వారిగా పంట సాగు వివరాలు సేకరించాలన్నారు. నీటిపారుదల, రైతు సామాజిక, ఆర్థిక స్థితిగతులు, రుణాల సేకరణ రైతులు వ్యవసాయ శాఖలో అనుసరిస్తున్న వివిధ పద్ధతులు, ఎరువులు, పురుగు మందుల వినియోగం తదితర వివరాలను మొబైల్ యాప్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ గణన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. ఎలాంటి పొరపాటు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సిపిఓ అశోక్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మోహన్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులు, ప్లానింగ్ స్టాటికల్ అధికారులు పాల్గొన్నారు.

## గీతామందిర్‌లో పూర్ణాహుతి, పుష్పయాగం

**ఘట్‌కేసర్, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ బాలాజీనగర్‌లోని గీతామందిర్‌లో గురువారం పూర్ణాహుతి ఘనంగా జరిగింది. గీతామందిర్‌లో శ్రీసదానంద యోగీశ్వరులు ఆత్మభోధపీఠం ఆధ్వర్యంలో 47వ గీతా జయంతి సందర్భంగా అకాండ హరేరామహరే కృష్ణనామ సత్తహోమ నిర్వహిస్తున్నరు. 195వ శివరామకోటి జపయజ్ఞగీత జ్ఞానయజ్ఞ ం, మహత్మములచే ఉపన్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నారు. హరేరామ నామ సప్తాహం, యజ్ఞపూజ, సాముహిక గీతాహవనం, ఆశీర్వాద ప్రసంగాలు, పూర్ణాహుతి, స్వామి పుష్పయాగోత్సవం, పవళింపు సేవ నిర్వహించారు. అర్చకుల మంత్రోచ్చారణాల మధ్య ఆలయంలో శ్రీవెంకటేశ్వరస్వామి, శ్రీరాధాకృష్ణుల కళ్యాణం జరుగగా బుధవారం రాత్రి గోవింద నామ స్మరణ మధ్య వెంకటేశ్వరస్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహకులు వెంకట్‌రెడ్డి, ఆత్మారాం, దాతల సహకారంతో నిత్యం భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు.

# వసతి గృహంలో సంఘటన బాధాకరం

**విద్యార్థులందరూ క్షేమంగానే ఉన్నారు**

**ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు**

**ప్రతిపక్షాలు రాద్దాంతం చేయడం మంచిదికాదు**

**గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించి ఎమ్మెల్యే**

**తాండూరు, డిసెంబరు 12, ప్రభాతవార్త :** తాండూరు పట్టణంలోని గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాల వసతి గృహంలో చోటు చేసుకున్న సంఘటన చాలా బాధాకరమని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. గత రెండు రోజుల క్రితం వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణం సాయిపూర్‌లోని గిరిజన బాలికల వసతి గృహంలో భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. గురువారం స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులతో మాట్లాడుతూ మనోధైర్యాన్ని కల్పించారు. అనంతరం



వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. వసతి గృహంలో చోటు చేసుకున్న సంఘటన చాలా బాధాకరమని అన్నారు. ప్రస్తుతం విద్యార్థులందరు క్షేమంగానే ఉన్నారని తెలిపారు. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రతిపక్షాలు రాద్ధాతం చేయడం మంచిది కాదని సూచించారు. చిన్నారుల జీవితాలతో ఆడుకోవాల్సిన అవసరం లేదన్నారు. జిల్లా కలెక్టర్ గత మూడు రోజులుగా స్వయంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. హాస్పిటల్‌లో ఉంచితే విద్యార్థులు భయపడతారనే ఉద్దేశంతో హాస్టల్‌లోనే ఉంచి మెరుగైన చికిత్స అందించడం జరిగిందని వివరించారు. వసతి గృహాలు, గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంలో ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో ఉందన్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వం మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచడం జరిగిందని గుర్తు చేశారు. ఇలాంటి విషయాల్లో ప్రతిపక్షాలు రాజకీయం చేయడం తగదని అన్నారు. ఏదైనా తప్పు జరిగితే సర్ధిచెప్పాల్సిన అవసరం ప్రతిపక్షాలకు ఉందని, కానీ చిన్నపిల్లల విషయంలో ఇలాంటి రాజకీయాలు చేయరాదని తెలిపారు. మరోవైపు జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. విద్యార్థుల అస్వస్థతకు కారణమైన వార్డెన్‌తో పాటు ముగ్గురు వంట సిబ్బందిని తొలగించి కొత్తవారిని నియమించడం జరిగిందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ చికిత్స అందించడం జరుగుతుందని వివరించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ పటోళ్ల రత్నమాల, సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, అబ్దుల్ రావూఫ్, పార్టీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వివేకానంద నగర్ బస్తీ వాసులకు త్వరగా ఇళ్లు కేటాయించాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్

**చిక్కడపల్లి, డిసెంబరు 12 ప్రభాతవార్త:** స్వామి వివేకానంద నగర్ బస్తీ వాసులు ఏడాదిగా ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులుగా వున్నారని కావున వెంటనే ప్రభుత్వం వారికి పునరావాసం క్రింద డబుల్ బెడ్ రూమ్ లు కేటాయించి ఆదుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ, బి సి సంక్షేమ మరియు హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ శ్రీ ఎ.వినయ్ కుమార్ కోరారు. గురువారం మంత్రిని కలిసి ఇదే విషయంలో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, బస్తి వాసుల ఇళ్ళ కేటాయింపు పై వ్రాసిన లేఖను అందజేశారు.ఇప్పటికే బస్తి వాసులు ఇళ్లు లేక, ఆర్థికంగా చాలా నష్ట పోయారని వెంటనే బాధితులకు డబుల్ బెడ్ రూమ్‌లు కేటాయించి న్యాయం చేయాలని వినయ్ కుమార్ గారు కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు ఇచ్చారని, త్వరలో బాధితులకు ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీ స్వామి వివేకానంద నగర్ బస్తీ వాసులు కృష్ణ, జ్ఞానేశ్వర్,ఆనంద్ రావు, వసంత్ పాల్గొన్నారు.

### దగాపడ్డ కళాకారుల డప్పుల మోత



కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత గుప్తా

**చిక్కడపల్లి, డిసెంబరు 12 ప్రభాతవార్త:** బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో పాటల పల్లకిలో 32 గంటలు దగపడ్డ కళాకారుల డప్పుల మోత కార్యక్రమం గురువారం జరిగింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 550 ఉద్యోగాలు కళాకారులకు ఇచ్చిందని, నిజమైన కళాకారులకు నిజమైన ఉద్యమకారులకి అవకాశం రాక అన్యాయం జరిగిందని కళాకారులు తమ పాట ద్వారా గళాన్ని వినిపించారు. ఇదే విషయంలో అనేక ఉద్యమాలు జరిగాయని, అయినా ప్రభుత్వం అందరిని అణచి వేసస్తూ అరెస్టులు చేసిందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం తమ మేనిఫెస్టో లో అధికారం లోకి రాగానే ఉద్యగాలను ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. నిజమైన ఉద్యమ కళాకారులకు న్యాయం చేసి వెయ్యి మందికి ఉద్యోగాలు ఇవ్వాలని నేర్నాల కిషోర్ అన్నారు. కార్యక్రమంలో అతిథులుగా తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వసుజాత, ప్రముఖ గాయకుడు అందెశ్రీ, రఘు, అశోక్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాకారులు తమ పాట ద్వారా తమ బాధను ఆటపాటలతో వ్యక్తం చేశారు.

### పేదలకు సిఎంఆర్ఎఫ్ వరంలాంటిది : ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



గోపాల్‌కృష్ణ కుమారుడి చికిత్స కోసం సిఎం రిలీఫ్‌ఫండ్ ఎల్ఒసి పత్రాన్ని అందజేస్తున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, డిసెంబరు 12 ప్రభాతవార్త** పేదల వైద్య చికిత్సకు సిఎంఆర్ఎఫ్ ఎంతో దోహదపడుతున్నదని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన కె.గోపాల్‌కృష్ణ తన కుమారుడు కె.వంశీకి నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స కోసం 2లక్షల సిఎంరిలీఫ్ ఫండ్ ఎల్ఒసి పత్రాన్ని అందజేస్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతున్న ప్రమాదకర వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పెద్ద ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారు ఆర్థికంగా దెబ్బతింటున్నారని, అలాంటి వారికి సిఎంఆర్ఎఫ్ ఒక వరం లాంటిదని పేర్కొన్నారు.

### అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ముఠాగోపాల్

**చిక్కడపల్లి,డిసెంబరు 12 ప్రభాతవార్త:** ముషీరాబాద్ నియోజకవర్గం లోని రాంనగర్ డివిజన్ చిక్కడపల్లి సోప్ ఫ్యాక్టరీ లైన్ లో సీవరేజ్ వాటర్ పైప్‌లైన్, ఆర్టీసీ క్రాస్ రోడ్ లో వాటర్ పైప్ లైన్ పనులను స్థానిక కార్పొరేటర్‌తో కలిసి ముషీరాబాద్ శాసనసభ్యులు ముఠా గోపాల్ బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. టిఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు ముఠా జైసింహ, స్థానిక డివిజన్ ప్రెసిడెంట్ శంకర్ ముదిరాజ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ముదిగొండ మురళి, ఇంద్రసేనారెడ్డి, నాగభూషణం, కందూరి కృష్ణ, మీడియా ఇన్చార్జ్ ముచ్చుకుర్తి ప్రభాకర్, జయదేవ్, జనార్ధన్, కొండమడుగు మధు, శివ యాదవ్, షాప్ జనార్ధన్, కూరగాయల శ్రీనివాస్, సునీల్, వెంకటేష్, మహేష్, శ్రీకాంత్ ముదిరాజ్, జి శ్రీనివాస్, గోక నవీన్, జ్ఞానేశ్వర్, నితిన్, శ్రీధర్ జలమండలి అధికారి మేనేజర్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

### శంషాబాద్‌లో ఘనంగా గీత జయంతి వేడుకలు

రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం

**శంషాబాద్. డిసెంబర్ 12. ప్రభాత వార్త** గీత జయంతి వేడుకలను శంషాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. హిందూ వినాయక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వివేకానంద కాలనీలో గీతా జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. హిందూ వినా యక ఉత్సవ సమితి అధ్యక్షుడు దేవి రెడ్డి రఘునాథ్ రెడ్డి కాలనీవాసులు గీత పారాయణం నిర్వహించారు. మహిళా భక్తులు బాల బాలికలు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హరే రామ హరే రామ..... కృష్ణ కృష్ణ హరే హరే నినాదాలతో భజనలు చేశారు శివనామస్మరణతో ఈ ప్రాంతం మారు మ్రోగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు గీత పుస్తకాలను అందజేశారు.



## హర్బన్ పార్క్ ఎకోటూరిజం అభివృద్ధికి సిద్ధం చేయండి

శ్రీమతి ప్రియాంక వర్గీస్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చార్మినార్ సర్కిల్



**కొడంగల్ రూరల్, డిసెంబరు 12 ప్రభాతవార్త** కొడంగల్‌లోని బొంరాస్పేట్ రిజర్వ్ ఫారెస్ట్ మరియు కొత్తూరు సెంట్రల్ నర్సరీ అప్పాయి పల్లిరిజర్వ్ ఫారెస్ట్‌లను గురువారం శ్రీమతి ప్రియాంక వర్గీస్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చార్మినార్ సర్కిల్ సందర్శించారు. బొమ్మి రాస్పేట్ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతం అర్బన్ పార్క్ మరియు ఎకో టూరిజం అభివృద్ధికి అనువుగా ఉందని ఆ ప్రాంతంలో అర్బన్ పార్క్ ఎకో టూరిజం అభివృద్ధికై ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. అటవీ ప్రాంతంలో అర్బన్ పార్క్ అభివృద్ధితో పాటుపక్కనే ఉన్న బొంరాస్పేట్ చెరువులో వాటర్ స్పోర్ట్స్ ప్రతిపాదనలు కూడా అవసరమని అధికారులకు సూచించారు. కొత్తూరు సెంట్రల్ నర్సరీని సందర్శించి ఆ నర్సరీలో రాబోయే వర్షాకాలానికి చందనం మొక్కల ను పెంచి రైతులకు అందే విధంగా చూడాలని ఆదేశించారు. కొత్తూరు ప్రజలకు ఉపయో గపడే మొక్కల పెంపకానికి చర్యలు తీసుకోవాలని నర్సరి యొక్క స్థాయిని మరింతగా పెంచాలని ఆదేశించారు. రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను జాగ్రత్తగా సంరక్షించాలని రంగురంగుల భోగం విలియా మొక్కలను నాటడం ద్వారా రోడ్డుకు ఇరువైపులా మరింత అందాన్ని చేకూర్చాలని హెచ్ఎండిఏ అధికారులకు సూచించారు. అప్పాయి పల్లి రిజర్వ్ ఫారెస్ట్ లో చేపట్టిన ప్లాంటేషన్ను సందర్శించారు. సరైన అటవీ మొక్కలను మంచి ఎత్తులో ఉన్న మొక్కలను నాటాలని హెచ్ఎండి అధికారులను ఆదేశించారు. అనంతరం కడ ఆఫీస్ యందు శ్రీ ప్రతీక్ జైన్ కలెక్టర్ వికారాబాద్ మరియు కడ స్పెషల్ ఆఫీసర్ శ్రీ వెంకట్ రెడ్డి జ్ఞానేశ్వర్ డిఎఫ్ వికారాబాద్ ఇతర అటవీ అధికారులు మునిసిపల్ కమిషనర్ శ్రీ బలరాం నాయక్ ఇతర సిబ్బందితో సమావేశమై కొడంగల్ లోని వివిధ అటవీ శాఖ అభివృద్ధి పనుల గురించి చర్చించారు. ఈ పర్యటనలో శ్రీ సవిత ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కొడంగల్ శ్రీ శ్యామ్ కుమార్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వికారాబాద్ మరియు సెక్షన్ ఆఫీసర్లు బీట్ ఆఫీసర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు

## శంకరమఠంలో ముగిసిన హరికథా మహోత్సవాలు

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త** నల్లకుంటలోని శ్రీశృంగేరి శంకరమఠం ప్రాంగణంలో హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాస 160వ, నేతి లక్ష్మీనారాయణ భాగవతుల 126వ జయంతి సందర్భంగా నిర్వహించిన హరికథా మహోత్సవములు శోభాయమానంగా ముగిశాయి.అన్నమయ్య పరివారం వ్యవస్థాపకులు యనమండ్ర వెంకట కృష్ణయ్య, నేతి కుటుంబము నుండి విశ్వేశ్వరరావు దంపతులు, రామకృష్ణ, పద్మశ్రీ దాలిపర్తి ఉమామహేశ్వరి భాగతారిణి, రాష్ట్ర హరిదాస సంఘం అధ్యక్షుడు బి. లక్ష్మీనారాయణ భాగవతులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు.ఈ సందర్భంగా వెంకట కృష్ణయ్య మాట్లాడుతూ నారాయణదాసు తెలుగు సంస్కృతి చరిత్రలోనే కాదు భారత సంస్కృతి చరిత్రలోనే అపూర్వ వైశిష్టం కలవారని, ఒక్కొక్క రంగంలో ప్రావీణ్యం ఉన్నవారు ఎందరో ఉండవచ్చు కానీ ఆట పాట మాటలో మేటి అనిపించుకున్నవారు అరుదుగా ఉంటారన్నారు. దాసుకు పూర్వం హరికథా చాయలు ఉన్నా దానికి ఒక సమగ్రమైన స్వరూపము, ఉన్నతమైన పీఠం, విశాలమైన పరిధి సంతరించి పెట్టినవారు నారాయణదాసని, ఆయన పాండిత్యం అనేకమైన భాషలకు, శాస్త్రాలకు సంబంధించినదని, ప్రావీణ్యం బహు కళలకు విస్తృతమైనదని, వ్యక్తిత్వం విశిష్టమైనదని, జీవితం స్వతంత్రమైనదని తెలియచేశారు. దాసు సంస్కృతాంధ్రాలలో మహాకవి, హరికథకు సృష్టికర్త, అచ్చతెలుగుకు అశ్వత్థవృక్షం, మహానటుడు, గంధర్వ గాయకుడు, సకల శాస్త్ర పారంగతుడు, వీణావాదన విశారదుడు, అష్టభాషాకవి మరియు బహుభాషావేత్తయని, ఈ పరమ భక్తాగ్రేసరుడు హరికథ అంటే ఏమిటో తెలియని కాలంలో తెలుగు ప్రజలకు దాన్ని రుచి చూపడమేకాక పలువురికి ఉపదేశించిన మహోపాధ్యాయుడని కూడా కొనియాడారు.



శంకరమఠంలో బుర్రా పద్మనాభశర్మ భాగవతలు 'శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం' హరికథా కథాగానం చేస్తున్న దృశ్యం

అనంతరం విజయవాడకు చెందిన బుర్రా పద్మనాభశర్మ భాగవతల మధురస్వరంలో శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం కథాగానముచేసి శ్రోతలను ఆకట్టుకున్నారు. డాక్టర్ పాణ్యం దక్షిణామూర్తి వయోలిన్ పైన, కే.చిదంబర నటరాజ్ కుమార్ మృదంగంపైన మృదువైన వాద్య సహకారం అందచేశారు.కార్యక్రమంలో భాగంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత దాలిపర్తి ఉమామహేశ్వరి భాగతారిణికి ఉత్సవముల నిర్వాహకులు ముఖ్య అతిథి ప్లాంజేరి శంకరనారాయణ చేతుల మీదుగా హరికథా సరస్వతి బిరుదు, సన్మానపత్రము, శాలువతో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథి ప్లాంజేరి శంకరనారాయణ మాట్లాడుతూ నారాయణదాస హరికథా సంప్రదాయాన్ని, పరంపరను ఆయన ప్రియశిష్యులు నేతి లక్ష్మీనారాయణ కొనసాగించినట్లు నేటి తరం హరిదాసులు కూడా కొత్త శిష్యులను తీర్చిదిద్ది సనాతనమైన ఈ హరికథలను భావితరాల వారికి అందచేయవలసిన బాధ్యత తీసుకోవాలని తెలియచేశారు.చివరలో కళాకారులను నిర్వాహకులు శాలువలతో సత్కరించారు. ప్రోగ్రామ్ కన్వీనర్ యనమండ్ర వెంకట కృష్ణయ్య వందన సమర్పణతో కార్యక్రమాలు ముగిశాయి.

## ఓ.యూలో ఘనంగా ఏఈజీ స్వర్ణోత్సవ వేడుకలు

**తార్నాక, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** ఆర్థిక వ్యవస్థపై భౌగోళిక అన్వేషణ గణనీయమైన ప్రభావం చూపుతుందని కేంద్ర సముద్ర అభివృద్ధి శాఖ మాజీ కార్యదర్శి, ఎన్జీఆర్ఐ మాజీ డైరెక్టర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ హర్ష్ కె. గుప్తా అన్నారు. ఆర్థిక వృద్ధిలో కీలకమైన లోహాలు, విలువైన ఖనిజాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. అసోసియేషన్ ఆఫ్ ఎక్స్ ప్లోరేషన్ జియోఫిజిసిస్ట్స్ (ఏఈజీ) స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా 46వ వార్షిక సమ్మేళనం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీ జియోఫిజిక్స్ విభాగంలో జియో ఎక్స్‌ప్లోరేషన్ ఫర్ క్రిటికల్ మినరల్స్ అండ్ ప్రీషియస్ మెటల్స్ పై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. జియోఫిజిక్స్ విభాగం, సెంటర్ ఫర్ ఎక్స్ ప్లోరేషన్ జియోఫిజిక్స్, ఏఈజీ సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సు ప్రారంభోత్సవానికి ఏఈజీ ఉపాధ్యక్షుడు, జియోఫిజిక్స్ విభాగం హెడ్ ప్రొఫెసర్ వీరయ్య అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ హర్ష్ కె గుప్తా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇటువంటి సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. సదస్సు నిర్వాహకులను అభినందించారు. విద్యార్థులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. అప్పుడే ప్రస్తుత పోటీ ప్రపంచంలో విస్తృత ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉంటాయని అభిప్రాయపడ్డారు. పరిశోధనలవైపు విద్యార్థులు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఇతర వక్తలు మాట్లాడుతూ భౌగోళిక అన్వేషణలో ఓఎన్‌జీసీ, , జీఎస్ఐ, ఎన్‌జీఆర్ఐ, ఏఎండీ, ఇతర కేంద్రప్రభుత్వ సంస్థలు క్రియాశీలకంగా పనిచేస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కరుణాసాగర్, ఓఎన్జీసీ బేసిన్ మేనేజర్ కరవణ్ణన్, జీఎస్ఐ మాజీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ రామమూర్తి, ఏఈజీ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి డాక్టర్ బి. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి బాబు, కోశాధికారి జవహర్, సహాయ కార్యదర్శులు అల్లిపీర, డాక్టర్ ఎంఎన్ చార్ పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పద్మశ్రీ ప్రొ.హర్ష్ కె.గుప్తా తదితరులు

## ప్రముఖ సాహితీవేత్తలు అమ్మంగి వేణుగోపాల్, వెల్దండ నిత్యానందరావులు

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు అధ్యక్షుడు డా. రియాజ్

**నాంపల్లి, డిసెంబరు 12 ప్రభాతవార్త :** డా. అమ్మంగి వేణుగోపాల్, డా. వెల్దండ నిత్యానందరావులు సుప్రసిద్ధ సాహితీవేత్తలని వారికి రావిచెట్టు రంగారావు తెలుగుభాషా వికాస పురస్కారం; ఎం.ఎల్.నరసింహారావు సాహితీసేవా పురస్కారం ప్రదానం ఎంతో అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు అధ్యక్షుడు డా. రియాజ్ అన్నారు. నిర్వాహకులు శ్రీకృష్ణదేవరాయ తెలుగుభాషా నిలయం అశేషసేవలను కొనియాడారు. శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం ఆధ్వర్యంలో భాషానిలయంలోని రావిచెట్టు రంగారావు సభామందిరంలో గురువారం రాత్రి సంస్థ గౌరవ కార్యదర్శి టి.ఉదయవర్లు నిర్వహణలో జరిగిన పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు అధ్యక్షుడు డా. రియాజ్ విశిష్ట అతిథులు తిరునగరి దేవకీదేవి, సంగనభట్ల నర్సయ్య తదితరులతో కలిసి సుప్రసిద్ధ రచయిత, కవి డా. అమ్మంగి వేణుగోపాల్‌కు భాషానిలయం వ్యవస్థాపక కార్యదర్శి, వితరణశీలి రావి చెట్టు రంగారావు జయంతిని పురస్కరించుకొని రావిచెట్టు రంగారావు తెలుగుభాషా వికాస పురస్కారం-2024; ప్రసిద్ధ పరిశోధకుడు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు డా. వెల్దండ నిత్యానందరావులను ఘనంగా సత్కరించి భాషానిలయం దీర్ఘకాల కార్యదర్శి, రచయిత ఎం.ఎల్.నరసింహారావు సాహితీసేవా పురస్కారం-2024 బహూకరించి ఎంతగానో అభినందించారు. భాషానిలయం గౌరవ కార్యదర్శి టి.ఉదయవర్లు స్వాగతోపన్యాసంలో సంస్థ సుదీర్ఘ చరిత్రను, సాహిత్యానికి, యువతాభ్యుదయానికి చేస్తున్న వివిధ కార్యక్రమాలు, ఇస్తున్న అవార్డులు, కృషిని సవివరంగా వివరించారు. చివరిగా పురస్కారగ్రహీతలు తమ స్పందనను తెలిపారు.



పురస్కారాల గ్రహీతలతో రియాజ్, ఉదయవర్లు తదితర అతిథులు

## క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు

**యూసుఫ్‌గూడ, డిసెంబర్ 12, ప్రభాతవార్త :** క్రైస్తవ సోదరులు అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహించే గ్రాండ్ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లను చేయడం జరుగుతుందని జూబ్లిహిల్స్ శాసన సభ్యులు మాగంటిగోపినాథ్ అన్నారు.ఇందుకు గాను గురువారం రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఎస్పిఆర్‌హిల్స్ జిహెచ్ఎంసి గ్రౌండ్‌ను ఆయన పరిశీలించారు. ఈనెల 14వ తేదిన గ్రాండ్ క్రిస్మమస్ వేడుకలను నిర్వహించనున్నామని నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లకు చెందిన పాస్టర్లు, క్రైస్తవ సోదరులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గం పాస్టర్ ఫెలోషిప్ ప్రతినిధులు, కార్పోరేటర్‌లు రాజ్‌కుమార్ పటేల్, దేదిప్య విజయ్ కుమార్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎస్పిఆర్‌హిల్స్ జిహెచ్ఎంసి గ్రౌండ్‌లో నిర్వహించబోయే గ్రాండ్ క్రిస్మస్ వేడుకల పనులను పరిశీలిస్తున్న జూబ్లిహిల్స్ శాసన సభ్యులు మాగంటి గోపినాథ్.

## మన సంస్కృతి సంప్రదాయాలు విశ్వఖ్యాతినొందాయి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

**రవీంద్రభారతి, డిసెంబరు 12 ప్రభాతవార్త :** విశ్వవ్యాప్తంగా ప్రపంచంలోని ఎన్నో దేశాల్లో ఎంతో గొప్పనైన మన సంస్కృతిని, సంప్రదాయాలను ఆచరిస్తున్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్న తెలంగాణ రాష్ట్ర మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ నేటితరం యువతలో అనేకమందికి మన పండుగల విశిష్టతలు, ఆచారాలు తెలువకపోవడం బాధాకరమని అన్నారు. రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో గురువారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తలసాని సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు ద్యాగ బాలరాజ్ యాదవ్ 700 శ్లోకాలతో కూడిన భగవద్గీతకు అదనంగా మరో 45 శ్లోకాలనుచేరి 745 శ్లోకాలతో కూడిన కర్మ, భక్తి, జ్ఞాన విభాగాలతో రూపొందించిన శ్రీ మద్భగవద్గీత పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ఇలాంటి పుస్తకాల ద్వారా మన చరిత్రను తెలుసుకోవచ్చన్నారు. అలనాటి అనేకరకాల చరిత్రను పుస్తకాల రూపంలో ప్రజల ముందుకు తీసుకొస్తున్న కవులు రచయితలకు అభినందనలు తెలిపారు. ప్రతీఒక్కరూ తప్పనిసరిగా మన చరిత్ర, సంప్రదాయాలను తెలిపే పుస్తకాలను తప్పక చదవాలని, మన సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు కృషిచేయాలని కోరారు. చివరిగా బాలరాజ్ యాదవ్‌ను తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చెన్నప్ప, ఆచార్య కసిరెడ్డి, జగన్నాథశాస్త్రి, ధర్మదాత, లావణ్య, పూర్ణ, కృష్ణస్వామి, దూబే, మాణిక్‌రావు పాటిల్, పార్థసారథి, అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రీమద్భగవద్గీత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌యాదవ్, దూబే, మాణిక్‌రావు, చెన్నప్ప, బాలరాజ్‌యాదవ్ తదితర అతిథులు

## రంగమణి నాట్యసేవలు అనితరసాధ్యం : సాహితీవేత్త ఓలేటి పార్వతీశం

**రవీంద్రభారతి, డిసెంబరు 12 ప్రభాతవార్త :** ప్రసిద్ధ నాట్యగురువు సి.ఆర్. ఆచార్యులు వారసురాలిగా కూచిపూడి, ఆలయ సంప్రదాయ నృత్యాలకే అంకితమై ఎంతోమంది శిష్య ప్రశిష్యులను అత్యుత్తమ నృత్యకళాకారులుగా తీర్చిదిద్దిన ఓలేటి రంగమణి నాట్యసేవలు అనితరసాధ్యమని వక్తలు కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, అభినయ దర్పణ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఓలేటి రంగమణి 5దశాబ్దాల నాట్యసేవల వైభవాన్ని శిష్యులంతా కలిసి మహా నాట్యారాధన మహోత్సవాన్ని నృత్యప్రదర్శనలతో కన్నుల పండువగా జరిపి గురుసత్కారం కావించి తమ గురుభక్తిని చాటుకున్నారు. ముందుగా వినాయకస్తుతితో కూచిపూడి నృత్యాంశాన్ని ప్రారంభించి సంధ్యాతాండవం, మండోదర శపథం తదితర అంశాలను అర్థవంతంగా ప్రదర్శించి ప్రశంసలందుకున్నారు. ముఖ్యంగా శ్రీనికరెడ్డి ప్రదర్శించిన అలమేలుమంగ ప్రవేశదరువు ఎంతో ఆకట్టుకుంది. ప్రవల్లిక పార్వతీ ప్రవేశ దరువు, మధుమిత జక్కులకాంత దరువులతో అలరించారు. వైష్ణవి వర్ణంతో కట్టిపడేసారు. చివరిగా సింహనందిని నృత్యం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. ఓలేటి పార్వతీశం నాట్య అర్థశతాబ్ది నిర్వహించుకునే అదృష్టభాగ్యం కొందరికే దక్కుతుందని, అందులో నాటి నేటి మేటిగురువు రంగమణి అని కొనియాడారు. విశిష్ట అతిథులుగా డా. మామిడి హరికృష్ణ, శివనాగేశ్వరరావు, డా. అనంతలక్ష్మి, డా. ఆర్.ప్రసన్నరాణి, నిర్మల ప్రభాకర్ తదితరులు పాల్గొని రంగమణి సేవలను ప్రశంసించి వారి శిష్యబృందాన్ని అభినందించారు.



గురువు రంగమణికి నృత్యనీరాజనం సమర్పిస్తున్న శిష్యులు

## లింక్ రోడ్డు ను పరిశీలించిన దాన కిషోర్..

**హైదరాబాద్, డిసెంబరు 12,ప్రభాతవార్త:** హెచ్‌సిటీ ప్రాజెక్టు పనుల అమలుపై ఎఐయుఎంలో సమావేశం నిర్వహించిన అనంతరం గురువారం రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి జి హెచ్ ఎం సి కమిషనర్ ఇలంబర్తి ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వ ప్రసాద్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సాయంత్రం మాసబ్‌ట్యాంక్ విరించి జంక్షన్, ..పెన్షన్ ఆఫీస్ వద్ద రోడ్డును.. క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ట్రాఫిక్ ఇబ్బందులను దూరం చేసేందుకు విరించి వద్ద రోడ్డు విస్తరణ, అభివృద్ధితో పాటు సుందరీకరణ పనుల చేపట్టాలని ఆదేశించారు అందుకు నిధులు కూడా మంజూరు చేసినట్లు ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ అధికారులను ఆదేశించారు, ఎలక్ట్రికల్ పోల్‌ల షిఫ్టింగ్ అధికారులకు సూచనలు చేశారు. పెన్షన్ ఆఫీస్ వద్ద బల్కాపూర్ నాలాపై సిమెంట్ బ్రిడ్జి నిర్మించి రోడ్డు 12ను అనుసంధానం చేస్తారు. పెన్షన్ ఆఫీస్ జంక్షన్ ట్రాఫిక్ భారం పడకుండా నేరుగా లింక్ రోడ్డు నిర్మాణం సాధ్యాసాధ్యాలపై అధికారులతో చర్చించారు. జంక్షన్ అభివృద్ధి తో సుందరీకరణతో పాటి లింక్ రెడ్డి నిర్మాణ పనులకు చేపట్టేందుకు టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలని ముఖ్యకార్యదర్శి అధికారులను ఆదేశించారు. ఆయనతోపాటు చీఫ్ ఇంజనీర్ భాస్కర్ రెడ్డి జోనల్ యస్ ఈ రత్నాకర్ ఈ ఈ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



లింక్‌రోడ్ మ్యాప్ పరిశీలిస్తున్న దానకిశోర్, కమిషనర్ ఇలంబర్తి, తదితరులు

## పల్లవి మోడల్ హైస్కూల్ భవనంపై నుండి పడిన విద్యార్థి



పల్లవి మోడల్ హైస్కూల్‌లో రెండవ అంతస్థు నుండి పడి గాయాలకు గురైన విద్యార్థి

**హైదరాబాద్, డిసెంబరు 12 ప్రభాతవార్త** బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పల్లవి మోడల్ హైస్కూల్‌లో రెండవ అంతస్తు నుండి తనీష్ రెడ్డి అనే విద్యార్థి అకస్మాత్తుగా కిందపడ్డాడు.పై అంతస్తు నుండి విద్యార్థి ఒక్కసారిగా కిందపడడంతో పాఠశాలలో విద్యార్థులంతా భయాందోళన గురయ్యారు.పల్లవి మోడల్ పాఠశాలలో తనీష్ రెడ్డి 9వ తరగతి చదువుతున్నాడు. హుటా హుటిన ఆస్పత్రికి తరలించిన పాఠశాల యాజమాన్యం తనిష్‌కు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థి ప్రమాదవశాత్తు కింద పడ్డాడా లేదా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.తనకు ఏం జరిగిందో తెలియదని వెంటనే సీసీ కెమెరాలు చూడాలని విద్యార్థి తన తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యాన్ని కోరుతున్నాడు.

## వైభవంగా అయ్యప్ప స్వామి మహా పడి పూజ



శ్రీ అయ్యప్ప స్వామి మహా పడి పూజ కార్యక్రమంలో పాల్గొన్న రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి,డిసెంబరు 12 ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ప్రేమావతిపేటలో గురువారం అత్యంత వైభవంగా శ్రీ అయ్యప్ప స్వామి మహా పడి పూజ కార్యక్రమం జరిగింది.రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి,మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి శ్రీ అయ్యప్ప స్వామి మహా పడి పూజలో పాల్గొన్నారు.కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు,అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

## చలి పెరగటంతో వణికి పోతున్న ప్రజలు

**చార్మినార్,డిసెంబరు 12 ప్రభాతవార్త :** రాత్రి వేళల్లో చలి ఎక్కువగా ఉండటంతో ప్రజలు భయటకు రావటానికి సందేహిస్తున్నారు.అత్యవసర పనులు నిమి త్తం మాత్రమే ప్రజలు బయటకు వస్తున్నారు.పాతబస్తీలోని రహదారులు రాత్రి వేళల్లో నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి.చలి పెరుగు తుండటంతో ప్రజలు రాత్రి వేళల్లో చలికి గజ గజ వణికి పోతున్నారు. ప్రజలు చలి నుంచి రక్షణ కోసం మప్లెర్లు,క్యాప్‌లు,స్వెట్టర్లు కొనుగోలు చేస్తున్నారు. చాంద్రాయణగుట్ట,బార్కస్,మహ్మద్ క్యాప్ మార్ట్, సంతోష్ నగర్,పటేల్ మార్కెట్,మీర్‌చౌక్,కిల్వత్,మూసాబౌలి ప్రాంతాలలోని షాపులలో పలు రకాల మప్లెర్లు,మంకీ క్యాప్‌లు, స్వెట్టర్లు అమ్మకాలు జరుగుతున్నాయి.కాగా పాతబస్తీలోని పలు బస్తీలలో వేకువ జామున చలి నుంచి కాపడుకోవటానికి కట్టెలతో మంటలు ఏర్పాటు చేస్తున్నారు.

## రాఘవేంద్రనగర్‌లో పర్యటించిన కార్పొరేటర్



సమస్యను తెలుసుకుంటున్న కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** నాచారం డివిజన్ పరిధిలోని రాఘవేంద్రనగర్‌లో కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ గురువారం అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ మాట్లాడుతూ రాఘవేంద్ర నగర్, ఇందిరానగర్ లకు వెళ్లే దారులన్నీ దాదాపు అన్ని భూగర్భ డ్రైనేజీ, మంచినీటి సమస్యలు పరిష్కరించి విశాలమైన సిమెంటు రోడ్లు చేయడమైందన్నారు. కేవలం ఆర్ఎస్ తిరుమల టవర్ నుండి శాంతి గార్డెన్స్ వరకు ఇదివరకు మంజూరైన కాంట్రాక్టర్ పనులు చేయకపోవడంతో పెండింగ్లో పడ్డాయన్నారు.ఈ విషయమై స్థానిక ప్రజలు పలుమార్లు తమకు ఈ సమస్య పరిష్కరించాలని కోరడం జరిగిందని దీంతో తాము పర్యటిం చడం జరిగిందన్నారు. ముందుగా డ్రైనేజీ, సిమెంటు రోడ్డు నిర్మా ణానికి ఎస్టిమేషన్లు తయారు చేయవలసిందిగా అధికారులకు సూచించడం జరిగిందన్నారు.తొందర్లోనే నిధులు మంజూరు చేయించి పను లు ప్రారంభమయ్యేలా చూస్తామని కార్పొరేటర్ హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయి జెన్ శేఖర్ నాయకులు మేకల ముత్యం రెడ్డి, కట్ట బుచ్చన్న గౌడ్, విఠల్ యాదవ్, దాసరి కర్ణ, కిట్టు, సత్యం, రహీం, ఆదిల్, మురళి, వెంకటేష్ వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## ఇంటి నుంచి వెళ్ళిన మహిళ అదృశ్యం..

**కొంపల్లి, డిసెంబర్ 12, ప్రభాతవార్త** ఇంటి నుంచి బయటికి వెళ్ళిన మహిళ అదృశ్యమైన సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లా, సంతబొమ్మాలి మండలం, ఎన్‌హెచ్ పురంకు చెందిన రత్నాలమ్మ (68) నిజాంపేట్‌లోని శ్రీనివాస నగర్, శ్రీ సూర్య అపార్ట్‌మెంట్స్‌లో నివాసం ఉంటున్న కుమారుడు టంకాల రమణ వద్దకు 20 రోజుల క్రితం ఆరోగ్యం బాగలేదని వైద్యం కోసం వచ్చింది. గురువారం సాయంత్రం 5 గంటలకు రత్నాలమ్మ ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్ళి ఎంతకు తిరిగి రాలేదు. ఆమె గురించి కొడుకు చుట్టు ప్రక్కల వెతికినా ఎక్కడ అచూకి లభించలేదు. తెలిసిన బంధు మిత్రులకు ఫోన్ ద్వారా విచారణ చేయగా ఎక్కడకి రాలేదని తెలిపారు. ఈ మేరకు రత్నాలమ్మ కొడుకు బాచుపల్లి పోలీసులను ఆశ్రయించారు. బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఎంపీడీవో

## చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

### సీఎం కప్ ముగింపు వేడుకల్లో ఎంపీడీవో

**నందిగామ డిసెంబర్ 12 ప్రభాతవార్త** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎంపీడీవో సుమతి సూచించారు. తెలంగాణ విజయోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సీఎం కప్ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతులుగా ఎదగాలన్నారు. ఈ.కార్యక్రమాల్లోఎంపీవో తేజ సింగ్, ఎంఇఒ శ్రీనివాస్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింలు,ఎంపిటిసి లు చంద్రపాల్ రెడ్డి, కొమ్ము కృష్ణ, దేపల్లే కుమార్ గౌడ్,హెచ్ ఎం సుధాకర్,ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్,గోపాల సింగ్,సల్మాన్ రాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య

**నందిగామ డిసెంబరు 12 ప్రభాతవార్త** విధి నిర్వహణలో భాగంగా వార్తను కవరేజ్ చేయడానికి వెళ్లిన టీవీ9 జర్నలిస్ట్ పై సినీ నటుడు మోహన్ బాబు భౌతికంగా దాడి చేయడం దురదృష్టకరమని నందిగామ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ లు,రవికుమార్ , శ్రీహరి, శివాగౌడ్, అగ్గిసూరి,రమేష్‌లు ఆరోపించారు. న్యూస్ కవరేజ్ చేసేందుకు వెళ్లిన జర్నలిస్టుల లోగోను లాక్కొని దాడి చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమే నన్నారు. నటుడు మోహన్ బాబు విలన్‌లా ప్రవర్తించడం హేయమైన చర్యగా వారు అభివర్ణించారు. నటుడు మోహన్ బాబుపై పోలీస్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## జర్నలిస్టులపై దాడి చేస్తే చట్ట పరంగా శిక్షించాలి

### ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షులు దర్పుల శంకర్

**తలకొండపల్లి, డిసెంబరు 12 ప్రభాతవార్త** రాష్ట్రంలోని జర్నలిస్టులపై ఎంతటి నాయకులైనా దాడి చేస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని తలకొండపల్లి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దర్పుల శంకర్ అన్నారు. గురువారం నాడు తలకొండపల్లి మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులపై జరిగిన దాడికి నిరసన వ్యక్తం చేస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈనెల 11న హైదరాబాదులో సినీ హీరో మోహన్ బాబు ఇంటిదగ్గర జరిగిన వివాదం కోసం టీవీ9 రిపోర్టర్ రంజిత్ వెళ్లగా అతనిపై మోహన్ బాబు విచక్షణ కోల్పోయి దాడి చేయడం హేయమైన చర్యని ఆయన అన్నారు. రాజ్యాంగం కల్పించిన మూడు సింహాలతో పాటు నాలుగో సింహమైన జర్నలిస్టు ల పైన దాడి చేయడం విడ్డూరమ్మన్నారు. సమాజంలో విఐపిగా గుర్తింపు పొందుతూ వారి స్వార్థం కోసం పత్రికలను జర్నలిస్టులను వాడుకొని తుదకు వారిపై దాడులు చేస్తున్నారని ఇప్పటికైనా జర్నలిస్టులపై దాడిని నిలువరించాలని విధంగా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. జర్నలిస్టులకు మద్దతుగా తలకొండపల్లి మాజీ సర్పంచ్ లలిత జోతయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్, సంఘాల నాయకులు పెరుమల నరసింహ, చంద్రయ్య, లింగం ధన నరసింహ లు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షులు దరువుల శంకర్, గౌరవ అధ్యక్షులు విష్ణువర్ధన్, మండల ప్రధాన కార్యదర్శి చప్పిడి తిరుపతి, కోశాధికారి కే చంద్రకుమార్, జర్నలిస్టు సంఘం నాయకులు వెంకటరెడ్డి, పి చంద్రకుమార్, గణేష్, శేఖర్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు

## పారిశుద్ధ్య కార్మికుని పరామర్శించిన ఎండిఓ

### వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేత

**నందిగామ డిసెంబరు 12 ప్రభాతవార్త** గత కొన్ని రోజులు గా అనారోగ్యం పాలై మంచం పట్టిన నందిగామ గ్రామపం చాయతీ పారిశుద్ధ కార్మికుడు శంశోద్దీన్ ను గురువారం ఎంపీడీవో సుమతి, ఎంపీఓ సింగ్, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ రెడ్డిలు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శంషోద్దీన్‌కు తాత్కాలిక ఖర్చులకోసం రూ.5వెలు అందజేశారు. అధైర్య పడ్డొద్దు అండగా ఉంటామని శంషో ద్దీన్ కుటుంబ సభ్యులకు అధికారులు ధైర్యం చెప్పారు.

## గృహప్రవేశ వేడుకల్లో ఎమ్మెల్సీ, ప్రముఖులు

**నందిగామ డిసెంబరు 12 ప్రభాతవార్త** నందిగామ మాజీ సర్పంచ్, జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు జిల్లెల్ల వెంకట్ రెడ్డి నూతన గృహప్రవేశ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఉమ్మడి మహబూబ్నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై అంజయ్య యాదవ్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ ఎమ్మె సత్యనారాయణ, అడ్వకేట్ విక్రమ్ శర్మ, చేగూరు సింగిల్ విండో చైర్మన్ ఎం విఠల్, తుమ్మల జగన్, జంగిలి కుమార్, రాంబాబు,గడ్డల యాదగిరి పలువురు అధికారులు, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.

## ఈ నెల 15న కుబేర భైరవి మహా హోమం

**శంకర్‌పల్లి, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** శంకర్‌పల్లి మండలం పర్వేద గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తగూడలో ఈ నెల 15న కుబేర భైరవి మహా హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మాధవరెడ్డి తెలిపారు. పౌర్ణమి సందర్భంగా గ్రామంలోని శ్రీ పాతాళ త్రికోణ మహా సుందరి ఆలయంలో కుబేర భైరవి (చివరి భాగం) మహా హోమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. హోమం సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించగలరని కోరారు.

## శాంతి భద్రతల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**శంకర్‌పల్లి, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** శాంతి భద్రతల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని శంకర్ పల్లి డీటెక్టివ్ ఇన్స్పెక్టర్ సమరంరెడ్డి అన్నారు. శంకర్ పల్లి డీటెక్టివ్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటు పడాల న్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తాన న్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలని కోరారు.

## ఎమ్మార్పీఎస్ ఉమ్మెతల గ్రామ కమిటీ ఎన్నిక

**కొందరు డిసెంబర్ 12 ప్రభాతవార్త :** కొందరు మండల పరిధిలోని ఉమ్మెతల గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆనెగల ఆనందం ఆనందం తెలిపారు. అధ్యక్షులుగా గొర్ల కాడ శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా,మంచనపల్లి శ్రీకాంత్, ఆనెగళ్ళ శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా మొగిలిగినందు,కార్యదర్శుగా. పి. నరేందర్, కె. బన్నీ. కోశాధికారి గా బి శ్రీకాంత్, అధికార ప్రతినిదు లు గా ఏ. నర్సిములు. ఈ. ప్రశాంత్, ప్రచారకార్యదర్శుగా ఎమ్. శేఖర్, మలికి మల్లేష్ తో పాటు సలహా దారులను, కార్యవర్గ సభ్యులను ఎన్నుకొన్నట్లు అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిలా అధ్యక్షులు రావుగాళ్ల బాబు, మండల నాయకులు టి. నర్సయ్య, ఎమ్. వెంకటయ్య, బి. మైందర్,ఎ. యాదయ్య, వి. రమేష్. వేణు, రామకృష్ణ, రామయ్య తదితరులు పాలుగొన్నారు.

### ఘనంగా హాలీడ్ టాయ్‌లిస్ట్

అమెజాన్ఇండియా ప్రకటించిందితన హాలీడ్ టాయ్‌లిస్ట్ యొక్క 8వ సంచికను ఈ ఎడిషన్ 24 డిసెంబర్ వరకు షాపర్స్‌కు ఆనం దం కలిగించనున్నది. చక్కగా కూర్చిన ఈ స్టోర్‌లో 10,000లకు పై గా బ్రాండ్లకు చెందిన 1.6మిలియన్‌లకు పైగా బొమ్మలు మరియు గేమ్స్ విస్తృత సెలక్షన్ ప్రదర్శిచదుతుంది.


అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించిన చెన్నకిషన్ రెడ్డి, నాయకులు

## పేదవారి ఆకలి తీర్చడమే లైన్స్ క్లబ్ లక్ష్యం

### లైన్స్ క్లబ్ మల్టిపుల్ ఏరియా లీడర్ మాజీ గవర్నర్ జి. చెన్న కిషన్ రెడ్డి

**కడ్తాల్, డిసెంబర్ 12, ప్రభాత వార్త:** తెలంగాణ రాష్ట్రం మల్టిపుల్ లోని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మిల్స్ అండ్ విల్స్ కార్యక్రమాన్ని క్లబ్ వారి ఆధ్వర్యంలో కడ్తాల బస్టాండ్ ఆవరణలో శ్రీమతి జూలూరి రాజేశ్వరి గారి జన్మదిన సందర్భంగా ఏర్పాటుచేసిన అన్న ప్రసాద కార్యక్రమాన్ని ప్రోగ్రాం కోఆర్డినేటర్ లైన్స్ క్లబ్ మాజీ గవర్నర్ జి. చెన్న కిషన్ రెడ్డి ప్రారంభించారు. పేదవారి ఆకలి తీర్చడమే లైన్స్ క్లబ్ లక్ష్యమని ఆయన అన్నారు. బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసే అన్న ప్రసాదం వల్ల బాటసారులు, ప్రయాణికులు, ఆకలితో అలమటిస్తున్న పేదలకు ఎంతో దోహదపడుతుందని అన్నారు, సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న క్లబ్ సభ్యులను ఆయన అభినందించారు. పేదవారికి సేవా చేయడం కోసం లైన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఏర్పడిందని జి. చెన్న కిషన్ రెడ్డి అన్నారు. లైన్స్ క్లబ్ ద్వారా చేపట్టే సేవా కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మానవసేవయే మాధవ సేవ అని ఆయన పిలుపునిచ్చారు. శిబిరాన్ని సందర్శించిన మాజీ గవర్నర్ జూలూరి రమేష్ బాబు మాట్లాడుతూ లైన్స్ క్లబ్ ఆమనగల్ ఎల్లప్పుడు పేదవారికి సేవతోపాటు ఉన్నత స్థాయిలో ఉంచేందుకు ప్రతి సభ్యులు కృషి చేయాలని అన్నారు. అన్న ప్రసాదం శిబిరంలో 450 మందికి అన్న ప్రసాదం అందజేసినట్లు పిఆర్ఓ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శి దోనాదుల మహేష్, రాజేందర్ యాదవ్, వేణు పంతులు, చేగూరి వెంకటేష్, పిప్పల వెంకటేష్, ఎల్ఈఓ ప్రెసిడెంట్ తరుణ్ కుమార్, శ్రీను, జట్టు కొండ లక్ష్మయ్య, క్లబ్ పిఆర్ఓ పాషా పాల్గొన్నారు.

## సంస్కృతి టౌన్‌షిప్‌లో అసోసియేషన్ ఎన్నికల ప్రచారం షూరూ


ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ హరిప్రసాద్‌రావు తదితరులు

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 12, ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్ సంస్కృతి టౌన్‌షిప్‌లో ఈ నెల 22 వ తేదిన జరుగనున్న ఎన్నికల్లో గెలిచేందుకు అభ్యర్థులు ప్రచారాన్ని గురువారం షూరు చేశారు. తమను గెలిపిస్తే చేపట్టబోయే అభివృద్ధి పనులను ఇంటింటికి తిరిగి వివరిస్తూ అధ్యక్షుడిగా పోటీచేస్తున్న మున్సిపల్ కౌన్సిలర్ అయిన బి. హరిప్రసాద్‌రావు తన ప్యానెల్ సభ్యులతో కలిసి తనకు మద్దతు తెలుపాల్సిందిగా కోరుతున్నారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా హరిప్రసాద్‌రావుతో పాటు ఉపాధ్యక్షుడిగా ఎ. సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శిగా కె. రామచంద్ర మూర్తి, కోశాధికారిగా ఆర్. రజనీకాంత్, కార్యవర్గ సభ్యులుగా పి. వెంకట్ రెడ్డి, వి. సరిత, ఎ.జోగేశ్వర్‌రావు, జిఎస్. ప్రతిభ, కె. ప్రగతి, వి. కొండయ్య, నక్క శ్రీనివాస్, ఎం. మంజులలు ఎన్నికల బరిలో నిలిచారు.

## సీఎం కప్ విజేతలకు బహుమతులు పంపిణీ


విజేతలకు బహుమతులు అందజేసిన చైర్మన్ కొండల్ రెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** క్రీడాకారులు గేలుపోటములతో నిమిత్తం లేకుండా క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ అన్నోజిగూడలో సీఎం కప్ విజేతలకు గురువారం బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణతో అభ్యసన చేయడం ద్వారా క్రీడాపోటీల్లో రాణిస్తారని అన్నారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన కబడ్డీ ప్రథమ బహుమతి చౌదరిగూడ, ద్వితీయ బహుమతి కొర్రెముల జట్లు నిలువగా వాలీబాల్‌లో ప్రథమ బహుమతి పోచారం, ద్వితీయ బహుమతి కొర్రెములకు లభించింది. విజేతలకు చైర్మన్ ట్రోఫిలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్‌తో పాటు కమిషనర్ వీరారెడ్డి, కౌన్సిలర్లు సింగిరెడ్డి సాయిరెడ్డి, ఎస్. రవీందర్, మున్సిపల్ మేనేజర్ అంజన్ రెడ్డి, నాయకులు ఎ. బాల్‌రెడ్డి, పీఈటీలు పి. తిరుమల్‌రెడ్డి, సునీత, శివరాం తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం కేసులో ఇద్దరిపై కేసు నమోదు

**మాడ్గుల, డిసెంబర్ 12,ప్రభాతవార్త:** మండలంలోని నాగిళ్ల,ఆర్కపల్లి గ్రామాల్లో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ మద్యాన్ని అమ్ముతున్న కిరాణం యజమా నులపై కేసు నమోదు చేసినట్లు సీఐ జగదీష్ తెలిపారు. మండలంలోని నాగిళ్ల గ్రామానికి చెందిన పాలకూర రవి, ఆర్కపల్లి గ్రామానికి చెందిన లకుమారపు శ్రీనివా సలపై కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. అక్రమ మద్యం స్వాధీనం చేసుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.



## ఇసుక ట్రాక్టర్ పట్టివేత



**దౌల్తాబాద్,డిసెంబర్ 12,ప్రభాతవార్త:** ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు దౌల్తాబాద్ ఎస్సై రవిగౌడ్ తెలిపారు.ఈ సంఘటన మండల పరిధిలోని కుదుర్‌మళ్ల గ్రామ శివారులో బుధవారంరోజు రాత్రి చోటుచేసుకుంది.ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం దౌల్తాబాద్ మండలం కుదురుమళ్ల గ్రామానికి చెందిన బోర బుద్దప్ప ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న విషయం పోలీసులకు అందడంతో అప్రమత్తమైన తమ సిబ్బంది ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ యజమాని బోర బుద్దప్పపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సంధర్భంగా ఎస్సై రవిగౌడ్ తెలిపారు.


సమ్మెలో పాల్గొన్న ఆమనగల్లు ఉద్యోగులు

## రెగ్యులర్ చేసే వరకు సమ్మె కొనసాగింపు

### -సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల హెచ్చరిక

**ఆమనగల్లు, డిసెంబర్12, ప్రభాతవార్త:** తమను రెగ్యులరైజ్ చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించేంతవరకు చేపట్టిన సమ్మె విరమింప చేసేది లేదని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ పార్టీ చొరవ చూపి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. న్యాయమైన డిమాండ్‌లు సాధించేవరకు వెనుకడుగు వేసే ప్రసక్తిలేదని వారు హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మెలో ఆమనగల్లు మండల సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు పాల్గొన్నారు. డిసెంబర్ 10 నుండి సమ్మెబాట పట్టిన అంధోళనకారులు గురువారం సమ్మెను మరింత ఉదృతం చేశారు. సంఘం రాష్ట్ర పిలుపు మేరకు ప్రభుత్వం స్పందించేంత వరకు సమ్మెను కొనసాగిస్తామని ఆమనగల్లు సంఘం తెలిపింది. సమ్మెలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని మండలాల నుండి ఎస్ఎస్ఏ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారన్నారు. కేజీబివి ఉద్యోగులు, ఎంఐఎస్ ఆపరేటర్లు, పీటీఐ, ఐఈఆర్‌టీలతోపాటు సీఆర్‌పీలు సమ్మెలో పాల్గొంటున్నట్లు వారు తెలిపారు. వారం రోజులుగా నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం శోచనీయమని సమగ్ర శిక్ష అభియాన్ మండల అధ్యక్షుడు, ఎంఐఎస్ సాయికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయమైన కోర్కెలు సాధించేవరకు సమ్మె కొనసాగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు కిషన్‌నాయక్,షేక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## మతాలు వేరైనా మనుషులంతా ఒక్కటే..!

### మాజీ ఎంపీపీ రవీందరన యాదవ్

### అయ్యప్ప స్వాములకు బిక్ష ఏర్పాటు చేసిన మహ్మద్ ఎజాజ్

**షాద్‌నగర్, డిసెంబరు 12 (ప్రభాతవార్త :** మతాలు వేరైనా మనుషులంతా ఒక్కటే అనే భావనతో యువకులు ముందుకు రావడం గర్వించదగ్గ విషయమని షాద్‌నగర్ బీఆర్ఎస్ యువ నాయకుడు, కేశంపేట మాజీ ఎంపీపీ వై. రవీందర్ యాదవ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట ఆంజనేయ స్వామి దేవాలయంలో బీఆర్ఎస్ యువ నాయకుడు మహ్మద్ ఎజాజ్ (అద్దు) అయ్యప్ప భక్తులకు బిక్షను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వై.రవీందర్ యాదవ్, కొత్తూరు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, దేవేందర్ యాదవ్, పిల్లి శేఖర్, చిన్న, యాదగిరి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ వై.రవీందర్ యాదవ్ మాట్లాడుతూ..అయ్యప్ప దీక్ష చేపట్టిన వారికి బిక్షను ఏర్పాటు చేసి ఎజాజ్ మత సామరస్యాన్ని చాటుకున్నారని పేర్కొన్నారు. మతాలు వేరైనా మనుషులంతా ఒక్కటే అనే భావనతో కలిసి మెలగాలని అన్నారు. నేటి సమాజంలో కులాలు, మతాలు అంటూ సమాజానికి హానికరంగా మారకుండా అంతా ఒక్కటే అని భావిస్తే సమాజంతో పాటు దేశం ముందుకు పోతుందన్నారు. అనంతరం మహ్మద్ ఎజాజ్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఎంతో మంది మిత్రులు ఇఫ్తార్ విందు ఇస్తారని, అలాగే హిందూ సోదరులకు కూడా బిక్ష ఏర్పాటు చేయడం ఎంతో సంతృప్తిని ఇస్తుందని అన్నారు. మనిషి కంటే మానవత్వం గొప్పదని, కులమతాల కన్నా సమానత్వం గొప్పదని అన్నారు.


స్వామివారి పూజలో మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్, అన్నదాత ఎజాజ్

## తిరుపతి వెంకన్న సేవలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


తిరుమలలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, డిసెంబరు 12 ప్రభాతవార్త :** కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి సేవలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తరించారు. గురువారం శ్రీ వెంకటేశ్వర స్వామి నిజరూప దర్శనాన్ని చేసుకున్నారు. స్వామివారిని ఎమ్మెల్యేతో పాటు ఆయన అభిమానులు రాయికల్ శ్రీనివాస్, తుపాకుల శేఖరన, కావలి కృష్ణ, పసుల బుచ్చయ్య, లింగారెడ్డిగూడ అశోక్, అంబటి అంజి యాదవ్, రవికుమార్, దేవగిరి నవీన్, బుడ్డ నర్సింహ్మ, నెహ్రూ నాయక్, మంకాల శ్రీశైలం, ఆగిరి శేఖర్, నందిగామ శేఖర్, రాణా ప్రతాప్, కిట్టు, శ్రీశైలం, సందీప్, మహేష్, వంశీ, పీఏ శ్రీనివాస్, బుచ్చయ్య, శ్రీను తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ఎమ్మెల్యే ప్రోటోకాల్ దర్శనంతో పాటు ఆయనను వెంకన్న సన్నిధిలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దర్శనం అనంతరం మాట్లాడుతూ ఏడుకొండల స్వామిని దర్శించుకోవడం ఎన్నో జన్మల పుణ్యఫలం అని అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత స్వామి వారికి మొక్కుబడి తీర్చుకునేందుకు కార్యకర్తలు, అభిమానులతో కలిసి వెంకన్న స్వామిని దర్శించుకున్నట్లు తెలిపారు.

## ఆర్.కృష్ణయ్యను సన్మానించిన బీసీ సేన నాయకులు


ఆర్.కృష్ణయ్యను సన్మానిస్తున్న బీసీసేన నాయకులు

**షాద్‌నగర్, డిసెంబరు 12 ప్రభాతవార్త :** రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన ఆర్.కృష్ణయ్యను షాద్‌నగర్ బీసీ సేన నాయకులు గురువారం కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ బీసీసేన నాయకులు హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో కలుసుకొని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీసేన జిల్లా ఉపాధ్యక్షుడు పసుపుల ప్రశాంత్, షాద్‌నగర్ అసెంబ్లీ అధ్యక్షుడు నరేష్, ప్రధాన కార్యదర్శి నరసింహ్మ చారి, కొందుర్గు మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌గౌడ్, నందిగామ మండల అధ్యక్షుడు ఆంజనేయులు యాదవ్, ఉపాధ్యక్షుడు రాఘవేందర్ చారి, బీసీ సేన నాయకులు కేశనమోని రాంచందర్ యాదవ్, కుమ్మరి కృష్ణ, రాము చారి, రాకేష్, చాకలి శ్రీచరణ్, తేజ ముదిరాజ్, శివకుమార్, గిరి, రమేష్, రాజేష్, శ్రీను, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.




## ఆరవ జిల్లా మహాసభలు వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

**తలకొండపల్లి, డిసెంబరు 12 ప్రభాతవార్త** తలకొండపల్లి మండలంలో గురువారం టీఎస్ యుటిఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆరవ జిల్లా మహాసభలు వా ల్పోస్టర్‌ను జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ రాములయ్య మరియు స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీలక్ష్మి గారు విడుదల చేయడం జరిగింది. ఈ మహాసభలలో మండల ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయ వంతం చేయాలని మండల అధ్యక్షులు ఎం విష్ణుమూర్తి గారు ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్ గారు ఈ సందర్భంగా కోర డం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, రియాజ్, సర్వేశ్వర్ రెడ్డి, విజయశ్రీ, రాణి మొదలగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా అంకురా రోహణం పూజ



**తలకొండపల్లి, డిసెంబరు 12 ప్రభాతవార్త** గురువారం రాంపూర్ గ్రామ లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మొదటిరోజు అంకురా రోహణము పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ పూజా కార్యక్రమం రాంపూర్ గ్రామం మాజీ సర్పంచ్ శ్యామసుందర్ రెడ్డి గారి చేతుల మీదుగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆలయ కమిటీ చైర్మన్ జిల్లెల్ల పవన్ కుమార్ రెడ్డి గుడి ఈవో స్నేలత గారు తలకొండపల్లి ట్రైనింగ్స్ఐ శ్రీకాంత్ గారు పాల్గొ న్నారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వైస్ చైర్మన్ అమృత గారు డైరెక్టర్లు స్వామి గౌడ్ గారు వెంకటయ్య గారు యాదయ్య గారు జంగిల్ గారు గుడి ప్రధాన అర్చకులు నరసింహా చారి గారు గ్రామ పెద్దలు హరి మోహన్ రెడ్డి శేఖర్ పాల్గొన్నారు.

## ముదిరాజ్ సన్మాన సభ విజయవంతం



**తలకొండపల్లి, డిసెంబరు 12 ప్రభాతవార్త** తలకొండపల్లి మండల కేంద్రంలో ముదిరాజ్ మండల అధ్యక్షుడు పల్లెమోని సుదర్శన్ ఆధ్వర్యంలో సన్మాన సభ ఏర్పాటు చేయడం జరిగింది ఆమనగల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా గీత నరసింహ ముదిరాజ్ గారు ఎన్నికైన సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఒక ముదిరాజ్ బిడ్డకు చైర్మన్ గా ఎన్నికైనందుకు తలకొండపల్లి మండల ముదిరాజులు ఈ కార్య క్రమాన్ని జరపడం జరిగింది. ఈ సందర్భంగా ముదిరాజుల ఐక్యతగా ఉండాలని సభను ఉద్దేశించి మార్కెట్ చైర్మన్ గీతా నరసింహ ముదిరాజ్ గారు మాట్లాడారు మండలంలో ముదిరా జులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమాన్ని వచ్చేసిన తలకొండపల్లి గ్రామ అధ్యక్షుడు బోలా బాలయ్య మండల ప్రధాన కార్యదర్శి పుట్ట పాండు తాలూకా ప్రధాన కార్యదర్శి పద్మ అనిల్ మండల మండల కార్యదర్శి నూకం మహేష్ యూత్ అధ్యక్షులు పుట్ట నాగరాజు ముదిరాజ్ సంఘం పెద్దలు నూకం శేఖర్ సానమని పాండు వెల్జాల్ సొసైటీ అధ్యక్షులు బాలకృష్ణయ్య మాజీ సర్పంచ్ భక్తి కుమార్ చంద్రధన బక్కి రాఘవేందర్ ఈసారి బాలకృష్ణ నూకం శివ సొసైటీ అధ్యక్షులు ఈ యాదయ్య కె చెన్నకిష్టయ్య చవిటి రవికుమార్ ముదిరా జ్ సభ్యులు

## యాచారంలో సక్సెస్ స్టడీ సర్కిల్ ప్రారంభం

**యాచారం డిసెంబర్ 12 ప్రభాతవార్త** నిరుద్యోగ యువత సక్సెస్ స్టడీ సర్కిల్ సెంటర్‌ని సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామానికి చెందిన గౌర శ్రీనివాస్,నవీన్ కుమార్ యాచారం మండల కేంద్రంలో సక్సెస్ స్టడీ సర్కిల్ సెంటర్ ను ఏర్పాటు చేశారు. సక్సెస్ స్టడీ సర్కిల్ సెంటర్ ని మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, మూడేడ్ల వెంకటరెడ్డి స్థానిక నాయకులతో కలసి ప్రారంభించారు. మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి , మాజీ ఎంపీటీసీ అరవింద్ నాయక్ ,గ్రామ శాఖ అధ్యక్షులు నర్రె శ్రీశైలం,సాజిద్,షాహిద్,రాజారెడ్డి, పాండు, జంగయ్య,యాదగిరి, ప్రశాంత్, లడ్డు, సుఫియాన్ పాల్గొన్నారు.

## ఇద్దరు పై కేసు నమోదు

**మాడ్గుల, డిసెంబర్ 12,ప్రభాతవార్త :** మండలంలోని ఆర్కపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు పై కేసు నమోదు చేసినట్టు సిఐ జగదీష్ తెలిపారు. ఈనెల 10న గ్రామానికి చెందిన బండరాజు, బండ బీరయ్య లు ఇంటి పక్కన ఉన్న గౌర శ్రీశైలం పై గొడ్డలితో దాడి చేసిన సంఘటనపై కేసు నమోదు చేసి అమన్ గల్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి రిమాండ్ తరలించినట్టు సిఐ జగదీష్ తెలిపారు. ఈ సంఘటనలో ఫిర్యాదారుడు శ్రీశైలానికి గాయాలలో ఐదు కుట్లు పడ్డాయని తెలిపారు.

## పాఠశాలను తనిఖీ చేసిన మండల ప్రత్యేక అధికారి



**దోమ.డిసెంబర్ 12 ప్రభాతవార్త** ప్రభుత్వం అందిస్తున్న మెనో ప్రకారం పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన బోజనం అందించాలని దోమ మండల ప్రత్యేక అదికారి హన్మంత్‌రావు అన్నారు. గురువారం నాడు దోమ మండల పరిదిలోని ఉదన్‌రావుపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను దోమలోని బాలికల ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు.ఈ సందర్బముగ పాఠశాల భవనం, తరగతులను,ఆవరణలను పరిశీలించారు. పాఠశాల భవనం సక్రమంగా లేదని, వర్షాకాలం వచ్చిందంటే పాఠశాల లోనికి వర్షం నీరు వస్తుందని ఉపాద్యా యులు ,విద్యార్థులు ఆయనకు తెలి య జేశారు. చదువుపై, పాఠ్యాం శాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. దోమ మండల పరిషత్ అభివృద్ధి అదికారి మహేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE DISTRICT JUDGE CUM MACT, CHITTOOR,AP
M.V.O.P.No.385 of 2022
Between
P. Guravaiah, ...Petitioner
And:
Avula Yuvaraj and others ..Respondents
NOTICE TO 2ND RESPONDENT
To
A. Muralikrishna
S/o. A. Jayachandran,
Residing at
P.No.3011 No.8-2-78/A,
Sri Sai Enclave, R.R.District.
Please take notice that the above petition filed by the petitioner for compensation stands posted to 27.12.2024 for your appearance and to file your counter. You are therefore directed by the above said court to appear before the above said court on 27.12.2024 at 10-30 a.m. and file your counter. Failing which the matter will be decided exparte.
By order of the court
C.SUDHAKAR GUPTA,
Advocate for Petitioner

## గుండ్లపోచంపల్లిలో సీఎం కప్ క్రికెట్ పోటీలు

**మేడ్చల్, డిసెంబర్ 12. ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ 2024 క్రికెట్ పోటీలు గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీలో గత మూడు రోజులుగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా గురువారం సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచులు జరిగాయి. సెమీఫైనల్ మ్యాచుల్లో ప్రతిభ కనబర్చి నిలిచిన ఫైనల్ మ్యాచ్‌లో 13వ వార్డు టీం, 1వ వార్డు టీంలు తలపడ్డాయి. ఈ పోటీలో విన్నర్‌గా 13వ వార్డు టీం లువగా, రన్నర్‌గా 1వ వార్డు టీం నిలించింది. యువతలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు గ్రామస్థాయి నుండి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు నిర్వహిస్తున్న ఈ ఆటల పోటీల్లో పాల్గొని తమ టాలెంట్‌ను యువత నిరూపించుకోవాలని ఈ సందర్భంగా పలువురు అన్నారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు, ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, సాయిపేట శ్రీనివాస్, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ గౌడ్, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ మోహన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, కుండ భానుచందర్, దొడ్ల మధు పాల్గొన్నారు.



గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో సీఎం కప్ విజేత టీంతో నాయకులు



ఆలయంలో అభిషేక పూజల్లో పాల్గొన్న భక్తులు

## శ్రీమహాదేవుని ఆలయంలో ప్రత్యేక పూజలు

కొడంగల్,డిసెంబర్ 12(ప్రభాతవార్త)
కొడంగల్ పట్టణంలోని శ్రీమహాదేవుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.చాతుర్మాస ముగింపు సందర్భంగా గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయంలో శివలింగానికి విశేష అలంకరణతో భక్తుల కొలాహలం మధ్య అభిషేక అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించారు.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టణానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీ : యువకుడు మృతి

**మొయినాబాద్, డిసెంబర్ 12, ప్రభాతవార్త :** ఉదయం మార్నింగ్ వాకింగ్ అని ఇంటి నుండి వెళ్ళిన యువకుడు తిరిగిరాని లోకానికి వెళ్ళాడు. గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టి ఇరువైమూడేళ్ళ యువకుడు మృత్తి చెందిన సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో చోటుచే సుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని చిల్కూర్ గ్రామానికి చెందిన సాదువు నర్సింహ తన కొడుకు యాక్సి డెంట్ ప్రమాదంతో చనిపోయాడని ఫిర్యాదు ఇచ్చినారు. వివరా ల్లోకి వెళితే గురువారం ఉదయం అందాజ 5:30 గంటల సమయంలో తన కుమరుడు శివ (23) చిల్కూర్ గ్రామం నుండి హిమాయత్‌నగర్ గ్రామం వైపు వాకింగ్ కి వెళ్తుండగా మహిళా ప్రాంగణము గేటు వద్ద గుర్తుతెలి యని వాహనం వేగంగా అజాగ్రతగా డ్రైవింగ్ చేసి శివకు మారకు టక్కర్ ఇవ్వగా అతనికి తీవ్ర రక్తగాయాలపాలయి అక్కడికక్కడే మృత్తిచెందాడు, వాహనదారుని గుర్తించి నాకు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రహించారు, పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కాంగ్రెస్ నేతలది పిచ్చి తుగ్లక్ పాలన

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి ఆరోపణ**



మేడ్చల్‌లో అధికారులతో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

**మేడ్చల్, డిసెంబర్ 12. (ప్రభాతవార్త ) :** మేడ్చల్ నియోజకవర్గంలో పిచ్చి తుగ్లక్ పాలనను తలపిస్తున్న రీతిగా కాంగ్రెస్ పార్టీ నేతల వ్యవహారం కొనసాగుతున్నదని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్ రెడ్డిఅన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీలో రోడ్ల విస్తరణలో భాగంగా ఉపాధి కోల్పోయిన చిరు వ్యాపారులను కలిసి అనంతరం ఈ విషయాన్ని మున్సిపల్ అధికారులు, పోలీసు సిబ్బందితో సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్ మున్సిపాలిటీ లో అధికారులు, పోలీసు సిబ్బంది ఇష్టారీతిన జెసిబిలతో కూల్చివేతలు చేయడం మంచి పద్ధతి కాదని అన్నారు. మున్సిపాలిటీలో జరుగుతున్న అనేక ఆక్రమాలపై మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించే అధికారులు మార్కెట్ లో వ్యాపారులపై మాత్రం జులుం ప్రదర్శించడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చేతిలో అధికారం పిచ్చోడి చేతిలో రాయి వలె ఉందని, ముందస్తు ప్రణాళికలు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా కూల్చివేతలు చేయడం వారి దుందుడుకు చర్యలకు నిదర్శనమని ఆరోపించారు. పదుల సంవత్సరాలుగా జీవనోపాధి పొందుతున్న పూలు, పండ్ల వ్యాపారులను రోడ్లన పడవేశారని, వెంటనే మార్కెట్ షెడ్లను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు జగన్ గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు కొండ అంజనేయులు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శులు జకట ప్రేమ్ దాస్, లవంగ్ శ్రీకాంత్, నాయకులు పాతూరి సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మల్లేష్ యాదవ్, రాగం అర్జున్, రాఘవ రెడ్డి, రతన్ రాథోడ్, గోవు నాగరాజు, వంశీ విజయ్, గొలికర్ మహేష్, హేమలత రెడ్డి, అనిత, బాబు రావు, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నెపల్లిని సందర్శించిన డిపిఓ జయసుధ



పూడూరు మండలం ఎన్కెపల్లిలో ఇంటిని పరిశీలిస్తున్న డిపిఓ జయసుధ,తదితరులు

**పూడూరు, డిసెంబరు 12, ప్రభాతవార్త :** పూడూరు మండలం పరిధిలోని ఎన్కెపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరి చేయుటకు నిర్ధారణకోసం గురువారం వికారాబాద్ జిల్లా పంచాయతీ అధికారిణి జయసుధ అద్వర్యంలో అధికారుల బృందం గ్రామాన్ని సందర్శించి పరిశీలించింది.ఈ సందర్భంగా గ్రామంలో అర్హులైన లబ్దిదారుల ఎంపికకోసం ఇంటింటికివెళ్లి వారి పాత ఇళ్ల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం గ్రామంలోని పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన వసతిని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ పాండు,ఎంపిఓ సుందర్,పంచాయతీ కార్యదర్శులు మాణిక్యం,శ్రీకాంత్‌రెడ్డి,మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు,మాజీ ఎంపిటిసి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 12, ప్రభాతవార్త**
సమగ్ర శిక్ష ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని, కనీస వేతన స్కేల్‌ను అమలు చేయాలని మేడ్చల్ జిల్లా ఎస్‌టియు టిఎస్ అధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు కోరారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ముందు సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరవధిక సమ్మె చేస్తూ ధర్నా చేస్తున్నారు. వీరికి జిల్లా ఎస్‌టియు టిఎస్ ఉపాధ్యాయ నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులకు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఉద్యోగులు పొందుతున్న అన్ని సౌకర్యాలను సమగ్ర శిక్ష ఉద్యోగులకు వర్తింప జేయాలన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి స్పందించి సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయటానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని ఆయన కోరారు. ఎస్‌టియు నాయకులు ప్రేమ్‌కుమార్, ప్రధానకార్యదర్శి సుధాకర్‌రెడ్డి, పలువురు నాయకులు మద్దతు తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా నాయకులు, పలు మండలాల వారు తదితరులు పాల్గొన్నారు.

# తుగ్లక్ పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**మాజీమంత్రుల అరెస్టును ఖండిస్తున్నాం : మాజీ ఎంపిపి మల్లేశం**

**పూడూరు, డిసెంబరు 12, ప్రభాతవార్త :** పోలీసుల నిర్బంధంతో తుగ్లక్ పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో తగిన మూల్యం చెల్లించుకోవల్సి వస్తోందని మాజీ ఎంపిపి,మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు పూడుగుర్తి మల్లేశం పేర్కొన్నారు.ఇటీవల తాండూరు గురుకుల పాఠశాలలో భోజనం వికటించి అస్వస్తతకు గురైన విద్యార్థులను పరామర్శించేందకు తాండూరు వెళుతున్న మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి,సత్యవతి రాథోడ్‌ల అరెస్టును ఖండిస్తూ గురువారం పూడూరు మండలం పరిధిలోని మన్నెగూడ జిల్లా పరిషత్తు అతిధిగృహంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు పోలీసులు కాంగ్రెస్ పార్టీ ఏజెంట్లు పనిచేస్తు బిఆర్ఎస్ పార్టీ నాయకులపై అక్రమకేసులు బనాయిస్తున్నారని,అలాంటి వారిని తమపార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. దోచుకొని దాచుకోవడానికే సరిపోయిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దళారులతో చేతులు కలిపి విద్యార్థులకు నాణ్యతలేని భోజనం పెట్టడం ఎంతవరకు సమంజసం? అని నిలదీశారు.
స.హక్కు చట్టం మండల కన్వీనర్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు దేవనోనిగూడ వెంకటయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాశాఖకు ఇప్పటి వరకు మంత్రిని కేటాయంచకపోవడం శోచనీయమన్నారు.రాష్ట్రంలో వేయి గురుకులాల్లో 50లక్షలమంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని,గతంలో కెసిఆర్ ప్రభుత్వం పౌష్టికాహారంతో విద్యార్థినిలకు కెసిఆర్ కిట్లను కూడా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపిపి మల్లేశం,వెంకటయ్య

అందజేయడం జరిగిందని వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం మౌళక వసతులు కల్పించడంలో విఫలం అయ్యిందని,విద్యార్థులకు కుళ్లినగుడ్లు,కూరగాయలు నాణ్యతలేని భోజనాలు అందించడం వల్లే అస్వస్థతకు గురవుతున్నారని, ఫుడ్‌సేఫ్టీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టాకాజ్యంగా నిర్వాహణ జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ప్రజాపాలనను గాలికి వదిలి భూదందాల సెటిల్మెంట్లు చేస్తున్నట్లు ప్రజలనుండి ఆరోపణలు వస్తున్నాయని వివరించారు.రైతులకు పూర్తిస్తాయి రుణమాఫీ చేయలేని సిఎం రైతుబంధును మరిచారని,మండలంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదని మండల బిఆర్ఎస్ పార్టీ నాయకుడు జాహెద్ ఆరోపించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు రయీస్‌ఖాన్, దయానంద్‌గౌడ్,ఆరీఫ్,ఫాజిల్,ఫైసల్‌ఖాన్,అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు

# మాజీ మంత్రులను అరెస్ట్ చేయడం తగదు



పూడూరు మండలం చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి,సత్యవతి రాథోడ్‌లు

**పూడూరు, డిసెంబరు 12, ప్రభాతవార్త :** మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్‌లను అరెస్ట్‌చేసిన పోలీసులు చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి ఉంచారు. ఇటీవల తాండూరు గురుకుల పాఠశాలలో భోజనం వికటించి అస్వస్తతకు గురైన విద్యార్థులను పరామర్శిం చేందకు గురువారం తాండూరు వెళుతున్న మాజీ విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి,మాజీ శిషు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌లను వికారాబాద్‌లో పోలీసులు అరెస్టుచేసి పూడూరు మండలం పరిధిలోని చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి సుమారు రెండు గంటలపాటు స్టేషన్‌లో ఉంచి అనంతరం విడుదల చేశారు.ఈ సందర్భంగా చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్ వద్దకు ఎవ్వరు రాకుండా భారీగా పోలీసుబందోబస్తును ఏర్పాటు చేశారు.అక్కడేఉన్న విలేకరులు ఫోటోలు తీసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డగించడంతో మాజీమంత్రి సబితాఇంద్రారెడ్డి కల్పించుకొని విలేకరులనుకూడా అరెస్టుచేస్తారా?అని అసహనం వ్యక్తం చేశారు. పిర్యాదుదారులు,బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఎవ్వరుకూడా లోపలికి వెళ్లకుండా ప్రహరీగోడ మెయిన్‌గేట్‌ను మూయించారు.




మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని విసి హాల్‌లో జిల్లా సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గౌతమ్, పాల్గొన్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి,పలువురు అధికారుల దృశ్యం

## 17న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాక

**ఏర్పాట్లు చేయాలని అధికారులకు కలెక్టర్ సూచన**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 11, ప్రభాతవార్త**
ఈ నెల 17వ తేదీన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి విడిది కోసం విచ్చేస్తున్నందున జిల్లాలోని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగ ఉండాలని తగు ఏర్పాట్లు చేయాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ హాల్‌లో శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నగరంలోని బొల్లారంకు 17న విచ్చేస్తున్నందున జిల్లా సంబంధిత అధికారులు అందరులతో సమీక్షా సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగ జిల్లా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకు రాష్ట్రపతి నిలయంలో విడిది చేయనున్నందున జిల్లా అధికారులు అందరు సమన్వయంతో పనిచేయాలన్నారు. అధికారులు ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండ అప్రమత్తంగ ఉండి ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ నెల 17వ తేదీన జిల్లా పరిధిలోని హకీంపేట్ ఎయిర్‌పోర్టుకు విచ్చేసి ఆ తరువాత బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి చేరుకుంటారని అన్నారు. శీతాకాల విడిది చేయటానికి రాష్ట్రపతి విచ్చేస్తున్నందున ఐదు రోజుల పాటు అధికారులు అప్రమత్తంగ ఉండి బాధ్యతాయుతంగ విధులు నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్కరు తమకు అప్పగించిన పనులను బాధ్యతాయుతంగ సక్రమంగ నిర్వహించాలన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండ ముందస్తు ప్రణాళికలతో రాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రపతికి ఆహ్వానం పలికేందుకు విఐపిలు వస్తారని అందుకు అనుగుణంగ ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. రోడ్లు ఎలాంటి గుంతలు లేకుండ మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. దీంతో పాటు షామియానాలు, టెంట్లు, కుర్చీలు, వేధికకు సంబంధించి అన్ని ఏర్పాట్లను చేయాలని ఆర్‌అండ్‌బి అధికారికి కలెక్టర్ సూచించారు. మున్సిపల్ అధికారులు కూడ ఎక్కడ కూడ చెత్తచెదారం లేకుండా పరిశుభ్రంగ ఉండేలా చూడాలని సంబంధిత కమిషనర్‌కు సూచించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండ అవసరమైన ఏర్పాట్లు చేయాలని విద్యుత్ అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్‌ఓ హరిప్రియ, కీసర,మల్కాజ్‌గిరి ఆర్డీఓలు సైదులు, శ్యాంప్రకాశ్, ఎసిపి రాములు, ఆయా శాఖల అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

## 31వ తేదీలోగా వ్యవసాయ గణనను పూర్తి చేయాలి

**మేడ్చల్ జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి వి.శేఖర్**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 12, ప్రభాతవార్త**
ఈ నెల 31వ తేదీలోపు వ్యవసాయ గణనను పూర్తి చేయాలని మేడ్చల్ జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి వి.శేఖర్ సూచించారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో వ్యవసాయ గణనను నిర్వహించటానికి వ్యవసాయ అధికారులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. దీనిలో మేడ్చల్ జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ పాల్గొన్నారు. వ్యవసాయ అధికారులకు, ప్రణాళిక సహాయ సంచాలకులకు, మండల వ్యవసాయ అధికారులకు, ఉప గణాంక అధికారులకు, విస్తీర్ణ అధికారులకు, మండల ప్రణాళిక ,గణాంక అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగ జిల్లా సిపిఓ శేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ గణణ2021-22సంవత్సరం రెండో దశలో 34గ్రామాలు, 2022-23సంవత్సరంలో మూడో దశలో 16గ్రామాలలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ వ్యవసాయ గణనను డిసెంబరు 31లోగా పూర్తి చేయాలని, ఎంపిక చేసిన గ్రామాలలోని సర్వేనెంబర్లు వారీగ ఏప పంటలు వేశారు, సాగునీటి పారుదల, వ్యవసాయదారులు ఉపయోగిస్తున్న పనిముట్లు, ఎరువులు, యాంత్రీకరణ, ఇతర వివరాలను మొబైల్ యాప్ ద్వారా నమోదు చేయాలని, తెలిపారు. ప్రభుత్వం నిర్ధేశించిన గడువులోగా వ్యవసాయ గణన కార్యక్రమాన్ని పూర్తి చేఆయలని అధికారులకు ఆయన సూచించారు. మాస్టర్ ట్రైనర్ ఉప గణాంకఅధికారి బాలమణి, మండల ప్రణాళిక,గణాంక అధికారి మాదవి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా శిక్షణ ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ, వ్యవసాయ, గణాకం అధికారులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు రవిచంద్ర

## మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

**ఘట్‌కేసర్, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.రవిచంద్ర డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్ పట్టణంలోని మహిళా సంక్షేమ భవన్‌లో గురువారం ఎం.రాంచందర్ అధ్యక్షతన ఘట్‌కేసర్ మున్సిపల్ కార్మికుల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రవిచంద్ర హజరై మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని, స్థానికంగా ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలన్నారు. గత 3 నెలల క్రితం ప్రభుత్వం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని 51 గ్రామపంచాతీలను ఆయా మున్సిపాలిటీలలో జీపీలను విలీనం చేశారని మున్సిపల్ విధి విధానాలు అమలు కాకుండా కార్మికులకు మాత్రమే ప్రభుత్వం అయోమయానికి గురి చేస్తుందని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇసూంత ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని, రోజుకు రెండుపూటలా పని విధానాన్ని రద్దు చేసి ఒంటి పూట విధులు ప్రకటించాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో లొటి ట ఈశ్వర్, కల్లూరి జయచంద్రలు పాల్గొని మాట్లాడారు.

### మున్సిపల్ యూనియన్ కమిటీ ఎన్నిక

ఘట్‌కేసర్ మున్సిపల్ యూనియన్ నూతన కమిటీని గురువారం ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షులుగా లొట్టి ఈశ్వర్, అధ్యక్షులుగా జి.సువర్ణ, శ్రావణి, శోభ, భూపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరాములు, ప్రధానకార్యదర్శిగా ఎం. రాంచందర్, సహాయ కార్యదర్శులుగా రాంకుమార్, గణేశ్, నగేశ్, కోశాధికారిగా జి.అరుణ, లక్ష్మి, భారతమ్మ, ఆర్గనైజర్స్ జి.రాజు, వినయ్, ముఖ్యసలహాదారులుగా ఎ.మల్లేశ , జి.నరసింహ, ఎం.బాలయ్యలను ఎన్నుకున్నారు.

## ఆర్ఓబీ సర్వీస్‌రోడ్‌కు అధికారుల మార్కింగ్



రోడ్డు వెడల్పుకు సర్వేచేసి మార్కింగ్ వేస్తున్న రెవెన్యూ, ఆర్అండ్‌బి అధికారులు

**ఘట్‌కేసర్, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న రైల్వేవంతెన సర్వీస్‌రోడ్డు కోసం అధికారులు సర్వే చేసి మార్కింగ్ చేశారు. ఆర్‌ఓబీ పిల్లర్లు వేసి శ్లాబు వేసే దశలో ఉండటంతో రహదారి వెడల్పు తక్కువగా ఉండగా విస్తరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రైల్వేగేటుపై నిర్మిస్తున్న వంతెన కోసం రహదారికి ఇరువైపులా గతంలోనే అధికారులు మారి ౖంగ్ చేసి బాధితులకు నష్టపరిహారం ఇవ్వగా కొందరు తీసుకోకపోవడంతో కోర్టులో డిపాజిట్ చేశారు. కొందరు నిర్వాసితులు పరిహారం తీసుకోకుండా అధిక పరిహారం కోసం కోర్టును ఆశ్రయించడంతో రోడ్డు వెడల్పుకు ఆటంకం ఏర్పడింది. రోడ్డు వెంట ఇండ్లు దుకాణాలు కూల్చివేయకుండానే రోడ్డు మధ్యన పిల్లర్ల నిర్మాణం చేశారు. జిల్లా ఇంచార్జ్, ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాలతో జిల్లా కలెక్టర్ గౌతంపొట్రు రెవెన్యూ అధికారులను సర్వే చేసి మార్కింగ్ చేయాలని సూచించారు. ఈమేరకు బుధవారం ఘట్‌కేసర్ నయబ్ తహశీల్దార్ రాజేందర్, ఆర్అండ్‌బి డీఈఈ సుశీలాబాయి, ఏఈ సిహెచ్ రంజిత్‌కుమార్, గిర్దావర్లు సాయిరాం, కావ్య, సర్వేయర్ వినయ్, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్, విఠల్, రాజేశ్, వెంకటేశ్‌లు రోడ్డుకు ఇరువైపులా మార్కింగ్ చేశారు. పోలీస్‌బందోబస్తు మధ్య దుకాణాలను తొలగించేందుకు సిద్ధమవుతున్నారు.



విద్యార్థులు మొక్కలు నాటుతున్న దృశ్యం

## పల్లె ప్రకృతి వనంలో మొక్కలు నాటిన విద్యార్థులు

**శామీర్‌పేట, డిసెంబరు 12, ప్రభాతవార్త** కేశ్వాపూర్ గ్రామంలో శ్రీనిధి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ స్టూడెంట్స్ వారి ఆద్వర్యంలో ఎన్ఎస్ఎస్ గ్రామ వికాస్ కార్యక్రమంలో భాగంగ పల్లె ప్రకృతి వనంలో విద్యార్థులు మొక్కలు నాటారు. గురువారం మూడుచింతలపల్లి మండలంలోని కేశ్వాపూర్ గ్రామంలో శ్రీనిధి కళాశాల విద్యార్థులు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి మండల ఎంపిడిఓ కెఎల్ వత్సలదేవి, కేశ్వాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి మల్లిఖార్జున్, శ్రీనిధి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ప్రీతిజీవన్, ఎస్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం కప్ విజేతలకు బహుమతులు ప్రదానం



బహుమతులను అందజేసిన శామీర్‌పేట సిఐ శ్రీనాథ్, పాల్గొన్న ఎంపిడిఓ మమతాబాయి, తహసీల్దార్ యాదగిరిరెడ్డి, ఎంఇఓ వసంతకుమారి

**శామీర్‌పేట, డిసెంబరు 12, ప్రభాతవార్త**
శామీర్‌పేట మండల స్థాయిలో సిఎం కప్ క్రీడా పోటీలు మజీద్‌పూర్‌లోని జైన్‌హెరిటేజ్ స్కూల్ గ్రౌండ్‌లో జరిగాయి. గురువారం ఉదయం శామీర్‌పేట మండలంలోని మజీద్‌పూర్‌లో ఉన్న జైన్‌హెరిటేజ్ స్కూల్ గ్రౌండ్‌లో సిఎం కప్ క్రీడాపోటీలు వివిధ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించారు. గురువారం ఉదయం శామీర్‌పేట మండల స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ కలెక్టర్ శంకర్‌కుమార్ విచ్చేసి క్రీడాపోటీలను ప్రారంభించారు. ఆ తరువాత విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. దీనిలో ఖోఖో పోటీల్లో విన్నర్స్‌గా అలియాబాద్ స్కూల్, మజీద్‌పూర్ స్కూల్ (బాలుర), రన్నర్‌గా అలియాబాద్ స్కూల్ (బాలికల), తుర్కపల్లి స్కూల్ (బాలికల) టీమ్‌లు రాణించాయి. కబడ్డీ పోటీల్లో విన్నర్స్‌గా తుర్కపల్లి స్కూల్ (బాలుర), అలియాబాద్ స్కూల్ (బాలుర) సాధించారు. రన్నర్స్‌గా తుర్కపల్లి స్కూల్ (బాలికల), అలియాబాద్ స్కూల్ (బాలికల)లు నిలిచాయి. వాలీబాల్ పోటీల్లో విన్నర్స్‌గా తుర్కపల్లి స్కూల్ (బాలుర), మురహరిపల్లి స్కూల్ (బాలుర)లు గెలుపొందారు. రన్నర్స్‌గా తుర్కపల్లి స్కూల్ (బాలికల), మురహరిపల్లి స్కూల్ (బాలికల) వారు విజేతలుగా నిలిచి బహుమతులను అందుకున్నారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు పంపటం జరుగుతుందన్నారు. శామీర్‌పేట సిఐ శ్రీనాథ్, ఎంపిడిఓ మమతాబాయి, తహసీల్దార్ యాదగిరిరెడ్డి, ఎంఇఓ వసంతకుమారి, ఎంపిఓ వినూత్న, జైన్ స్కూల్ ప్రిన్సిపల్ స్వాతి భట్టాచార్య, పలు ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, పిఇటిలు, పంచాయతీ కార్యదర్శులు, విద్యార్థులు, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెల పెంపకం దారుల సంక్షేమానికి నిధులు కేటాయించాలి



అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కొమురయ్య, కుమార్

**ఘట్‌కేసర్, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** గొర్రెల కాపరుల సంక్షేమానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరుతూ గొర్రెల కాపరుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఎక్కలదేవి కొమురయ్య ఆధ్వర్యంలో గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈనెల 16 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో గొర్లకాపరుల సమస్యల పరిష్కారానికి, గొర్రెల పంపిణీకి ప్రత్యేక చర్యలు తీసుకొని నగదు బదిలీ ద్వారా అమలు చేయాలని కోరారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షులు మేకల కుమార్, ప్రధానకార్యదర్శి ఎక్కలదేవి కొమురయ్యలు మాట్లాడుతూ ఈనెల 19న హైదరాబాద్‌లో గొల్ల, కురుమల హక్కుల సాధనకై ధర్నా నిర్వహించనున్నారని పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రెండో విడత గొర్రెల పంపిణీకి నగదు బదిలీ రెండు లక్షల రుపాయలు చేయాలని, గొర్ల కాపరులు ప్రమాదవశాత్తు చనిపోతే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పశువైద్యాధికారులు, సిబ్బంది ఖాళీలను సకాలంలో భర్తీ చేయాలని. రెండు సంవత్సరాలుగా నట్టల నివారణ మందులు ఇవ్వడం లేదని జీవాలకు కనీస వైద్యం అందడం లేదని పేర్కొన్నారు. గొర్రెల పెంపకం దారుల సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నిర్వీర్య ం చేస్తున్నారని తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులు చీర గోపాల్, జిల్లా సహాయకార్యదర్శి బాషని వెంకటేశ్, జిల్లా నాయకులు మహేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నైపుణ్యత, శిక్షణ కోసం ఒప్పందం

**ఘట్‌కేసర్, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ ఘణాపూర్‌లోని కొమ్మూరి ప్రతాపరెడ్డి కళాశాలలో విద్యార్థులకు అవసరమైన శిక్షణ, నైపుణ్యతను పెంపొందించేందుకు ఇరు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నారు. కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (కేపీఆర్‌ఐటీ), టిఎన్ఎస్ ఇండియా ఫౌండేషన్ (టిఎన్ఎస్ఐఎఫ్) మధ్య సహకార ఒప్పందం (ఎంఓయు) కుదిరింది. ఈమేరకు కేపీఆర్‌ఐటీ వైస్‌చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, డైరక్టర్ ప్రొఫెసర్ బి.సుధీర్‌ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్ర ఎక్లార్కర్, టిఎన్ఎస్ఐఎఫ్ మేనేజింగ్ డైరక్టర్ రూపాబోప్రాలు హజరై ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి మార్చుకున్నారు. కేపీఆర్‌ఐటీ, టిఎన్ఎస్ఐఎఫ్‌ల మధ్య సమర్థవంతమైన భాగస్వామ్యానికి, విద్య, పరిశ్రమ మధ్య విభిన్న సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి పునాదిగా నిలుస్తుందని వైఎస్‌చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి అన్నారు.

## ప్రజా పాలన కాదు-రైతులకు బేడీలేసే పాలన

**సంగారెడ్డి టౌన్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** ఆడబిడ్డలపై ఆకృత్యాలు చేసే దుర్మార్గులపై చర్యలు లేవని, మత్తు పదార్థాల మాఫియాకు శిక్షలు ఉండవని భూ కబ్జాలు చేసే కాంగ్రెస్ గద్దలపై కేసులు ఉండవని, రక్తాన్ని చెమటగా మార్చి బుక్కెడు బువ్వ పెట్టే అన్నదాత చేతికి సంకెళ్లు వేసే కాంగ్రెస్ ప్రభుత్వ సిగ్గు పడాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మండిపడ్డారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ లగచర్ల రైతు ఈర్యా నాయక్‌ను చికిత్స కొరకు సంకెళ్లు వేసి ఆసుపత్రికి తీసుకుపోవడం రాష్ట్ర చరిత్రలో కాంగ్రెస్ పాలనలోనే చోటు చేసుకుందని దుయ్యబట్టారు. లగచర్ల రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం పునరాలోన చేయాలని ఎమ్మెల్యే హితువు పలికారు. కార్యక్రమంలో మాజీ టిఎన్‌జిఎస్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మామిళ్ల రాజేందర్, రాష్ట్ర నాయకులు జైపాల్‌రెడ్డి, మాజీ సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, ఆర్ వెంకటేశ్వర్లు, సాబేర్ తదితరులు పాల్గొన్నారు.